**వరుసగా మూడో ఏడాది.. సింగపూర్‌లో శివాలయాల సందర్శన యాత్ర**

సింగపూర్‌లో శివాలయాల సందర్శన యాత్ర నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తెలంగాణ కల్చరల్ సొసైటీ (సింగపూర్) ఆధ్వర్యంలో శివాలయాల సందర్శన యాత్రను గత మూడేండ్లుగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఫిబ్రవరి 26న రాత్రి 9 గంటలకు ప్రారంభమైన యాత్ర మరుసటి రోజు ఉదయం 7 గంటల వరకు కొనసాగింది. ఈ భక్తి యాత్రలో బాగంగా సింగపూర్‌లో ఉన్న 11-12 ప్రముఖ శివాలయాలను సందర్శించారు.సింగపూర్‌లోని జురాంగ్ ఈస్ట్, బుకిత్ పంజాంగ్, సెంగ్ కాంగ్- పుంగ్గోల్, టాంపనీస్-బెడోక్ ప్రాంతాల నుంచి 210 మంది భక్తుల్లో బస్సుల్లో బయల్దేరారు. వివిధ దేవాలయాలను సందర్శించి ఆ పరమ శివుని దీవెనలు పొందారు. దీంతో ప్రముఖ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివనామ స్మరణతో మారుమ్రోగాయి.ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా సురక్షితంగా యాత్రను నిర్వహించిన సింగపూర్ తెలంగాణ కల్చరల్ సొసైటీకి భక్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఎలాంటి లాభాపేక్ష, ఆడంబరాలు లేకుండా సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు అభినందించారు.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :09 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేదీ: ఆదివారం 02-03-2025 | పేజీలు:4 వెల: 2.00


## డోనాల్డ్ ట్రంప్‌తో వాగ్వాదం.. క్షమాపణలు చెప్పేందుకు నిరాకరించిన జెలెన్‌స్కీ



న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్.. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మధ్య.. వాషింగ్టన్ డీసీలోని వైట్‌హౌజ్‌లో జరిగిన భేటీ వాగ్వాదానికి దారి తీసింది. ఓవల్ ఆఫీసులో ఆ ఇద్దరు నేతలు మీడియా ముందే చిర్రుబుర్రులాడుకున్నారు. ఖనిజాలపై ఒప్పందం చేసుకునేందుకు దౌత్యపరమైన పర్యటన చేపట్టిన జెలెన్‌స్కీ.. ఆ ఒప్పందం కుదుర్చుకోకుండానే వెనుదిరగాల్సి వచ్చింది. విభిన్న అంశాలపై ట్రంప్, జెలెన్‌స్కీ మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. రూమ్ అంతా నిండిన మీడియా ముందే ఆ ఇద్దరు నేతలు మాటల యుద్ధం కొనసాగింది. ఆ తర్వాత వైట్‌హౌజ్‌ను వీడి జెలెన్‌స్కీ వెళ్లిపోయారు. జెలెన్‌స్కీకి శాంతి ఒప్పందం కుదుర్చుకోవాలన్న ఉద్దేశం లేదని ట్రంప్ పేర్కొన్నారు. అయితే ట్రంప్‌తో వాగ్వాదం తర్వాత.. అమెరికా మీడియా సంస్థ ఫాక్స్ న్యూస్‌కు వెళ్లి జెలెన్‌స్కీ ఇంటర్వ్యూ ఇచ్చారు.వైట్‌హౌజ్‌లో తన ప్రవర్తనను సమర్థించుకున్నారు జెలెన్‌స్కీ. చెడు చేయలేదన్న ఉద్దేశాన్ని వ్యక్తం చేశారు. ఫాక్స్ న్యూస్ యాంకర్ అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ.. క్షమాపణలు చెప్పేందుకు నిరాకరించారు. అమెరికా ప్రజల్ని అమర్యాదపరిచారా, మీరేమైనా క్షమాపణలు చెప్పాలనుకుంటున్నారా అని అడిగిన ప్రశ్నలను జెలెన్‌స్కీ దాటవేశారు. తన పర్యటన పట్ల అమెరికా చేసిన ఏర్పాట్లను జెలెన్‌స్కీ ప్రశంసించారు. వ్యూహాత్మక భాగస్వామ్యుల మధ్య చాలా గాఢమైన చర్చలు అవసరం అని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో చాలా హుందాగా, నిజాయితీగా ఉండాలని, ఒకర్ని ఒకరు అర్థం చేసుకోవాలన్నారు.అగౌరవపరిచారా, క్షమాపణలు చెబుతారా అని యాంకర్ మరో సారి అడగ్గా.. తానేమీ తప్పు చేయలేదని జెలెన్‌స్కీ తెలిపారు. అమెరికా అధ్యక్షుడిని గౌరవిస్తానని, అమెరికా ప్రజల్ని కూడా గౌరవిస్తున్నట్లు చెప్పారు. తామేమీ చెడు చేయలేదని ఆయన అన్నారు. కొన్ని అంశాలను ప్రైవేటుగా చర్చించాల్సి ఉంటుందన్నారు. అయితే ప్రైవేటుగా ట్రంప్‌కు క్షమాపణలు చెబుతారా లేదా అన్న అంశంపై క్లారిటీ లేదు.ఓవల్ ఆఫీసులోనే అమెరికాను అమర్యాదపరిచారని, ఒకవేళ శాంతి స్థాపనకు సుముఖంగా ఉంటే జెలెన్‌స్కీ మళ్లీ రావచ్చు అని ట్రంప్ ఓ స్టేట్మెంట్‌లో పేర్కొన్నారు. ఉక్రెయిన్ సంక్షోభంపై శాంతియుత తీర్మానం చేయాలని అమెరికా భావిస్తున్నదని, కానీ ఆ సంక్షోభంలో అమెరికా పాత్ర సుదీర్ఘకాలం ఉండాలని జెలెన్‌స్కీ భావిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. తాము శాంతి కోసం చూస్తున్నామని, శక్తివంతమైన దేశంతో ఒప్పందం కుదుర్చుకుని, శాంతి బాట వీడాలనుకుంటున్నారని, పదేళ్ల యుద్ధాన్ని తాము ఆశించడంలేదని, సంతకం చేస్తే, యుద్ధం కొనసాగించాలని జెలెన్‌స్కీ ఆలోచిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్లు,రేషన్ కార్డుల పంపిణీపై చర్చ..



హైదరాబాద్,తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 6న సెక్రటేరియట్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరగనుంది. ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. ముఖ్యంగా బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లుల ఆమోదంపై ప్రధానంగా సమాలోచనలు జరగనున్నాయి.రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించేందుకు రెండు ప్రత్యేక బిల్లులను ఆమోదించనున్నట్లు సమాచారం. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లు.. అలాగే.. విద్య, ఉద్యోగాల్లో బీసీ రిజర్వేషన్ల కోసం మరో బిల్లు తీసుకురానున్నట్లు పేర్కొంటున్నారు. ఈ రెండు బిల్లులను కేబినెట్ ఆమోదించనున్నారు. అదే విధంగా, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేందుకు మరో బిల్లును కూడా మంత్రివర్గం ఆమోదించే అవకాశం ఉంది.

**ప్రధాని మోదీతో భేటీపై నిర్ణయం..**

బీసీ రిజర్వేషన్ల బిల్లులు అసెంబ్లీలో ఆమోదం పొందిన అనంతరం ముఖ్యమంత్రి సహా మంత్రివర్గ సభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రతిపక్ష నేతలతో కలిసి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలవాలని ప్రభుత్వం యోచిస్తోంది.అలాగే, రాష్ట్రంలో నిర్వహించిన రెండో విడత కులగణన సర్వే ఫలితాలను కూడా ఈ సమావేశంలో సమీక్షించనున్నారు.

**ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల పంపిణీపై చర్చ..**

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసిన తర్వాత ఇందిరమ్మ ఇండ్లకు ఆర్థిక సాయం, కొత్త రేషన్ కార్డుల పంపిణీ వంటి సంక్షేమ కార్యక్రమాలపై కూడా కేబినెట్ చర్చించనుంది. ఈ నెలలోనే లబ్దిదారులను ఫైనల్ చేయాలని రేవంత్ సర్కార్ యోచిస్తోంది.

**అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలపై నిర్ణయం**

ప్రస్తుత రాజకీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర బడ్జెట్ సమావేశాలను ఈ నెల రెండో వారంలో నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోంది. పార్లమెంట్ సమావేశాలు ఈ నెల 10న ప్రారంభం కానుండటంతో, అసెంబ్లీ సమావేశాలను అంతకు ముందే నిర్వహించాలా లేదా అదే సమయంలో ప్రారంభించాలా అనే అంశంపై నిర్ణయం తీసుకోనున్నారు.అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ల బిల్లులను ఆమోదించిన తర్వాత, ప్రధాని మోదీని కలిసి రాజ్యాంగంలోని షెడ్యూల్ 9లో తెలంగాణ బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని చేర్చాలని కోరేలా ప్రణాళిక సిద్ధమవుతోంది.

**రాహుల్ గాంధీ భేటీకి హాజరయ్యే అవకాశం**

ఈ ప్రక్రియలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా భాగస్వామ్యం కావచ్చనే సమాచారం. కేంద్ర ప్రభుత్వంతో చర్చల అనంతరం, ఈ నెల రెండో వారంలో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం ఉంది.ఈ కేబినెట్ సమావేశం ద్వారా తెలంగాణ రాజకీయ భవిష్యత్తుపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

## నితీష్ నేతృత్వంలోనే బీహార్ ఎన్నికలు.. బీజేపీకి 100, జేడీయూకి 90 సీట్లు..

బీహార్ : బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు మరికొన్ని నెలల సమయం మాత్రమే ఉంది. మరోసారి బీజేపీ-జేడీయూ కలిసి పోటీ చేయబోతున్నాయి. ఈసారి కూడా బీహార్‌లో నితీష్ కుమార్ నేతృత్వంలోనే ఎన్డీయే కూటమి ఎన్నికల బరిలోకి వెళ్లే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.ముఖ్యమంత్రి ఎవరనే ఊహాగానాలను పక్కనపెట్టి, రాబోయే ఎన్నికల్లో నితీష్ నాయకత్వం వహిస్తారని బీజేపీ ఇప్పటికే స్పష్టం చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే, ఎన్నికల తర్వాత సీఎం తానే కావాలా..? లేక వేరెవరినైనా నియమించాలనే విషయంపై నితీష్ కుమార్ నిర్ణయం తీసుకుంటారని తెలుస్తోంది.ప్రస్తుతం ప్రజల మూడ్‌ని తెలుసుకునేందుకు బీజేపీ బీహార్‌లో సర్వే చేస్తోంది. సర్వే ఫలితాల ఆధారంగా ఎన్డీయే మిత్ర పక్షాల మధ్య సీట్ల కేటాయింపు ఉంటుందని తెలుస్తోంది. ప్రతీ నియోజకవర్గంలో బలమైన అభ్యర్థిని పోటీకి దింపే అవకాశం ఉంది. ఇటీవల హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీ ఎన్నికల్లో సాధించిన ఫలితాలను, బీహార్‌లో రిపీల్ చేయాలని బీజేపీ భావిస్తోంది. ఓటర్ల నాడిని తెలుసుకునేందుకు ప్రతీ నియోజకవర్గంలో సర్వేలు నిర్వహిస్తోంది.బీహార్‌లో ఎన్డీయే కూటమి భాగస్వాము లుగా బీజేపీ, జేడీయూ, రాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్),



జితన్ రామ్ మాంఝీ హిందూస్థానీ అవామీ మోర్చా , ఉపేంద్ర కుష్వాహా రాష్ట్రీయ లోక్ సమతా పార్టీ ఉన్నాయి. బీజేపీ దాదాపుగా 100 సీట్లలో పోటీ చేస్తుందని, జేడీయూ 90-95 సీట్లలో పోటీ చేస్తుందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. మిగిలిన స్థానాల్లో మిగతా ఎన్డీయే భాగస్వాములకు సీట్లను కేటాయించనున్నారు. బీహార్‌లో మొత్తం 243 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి.

## ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద గుండెలు అవిసేలా రోదనలు



నాగర్ కర్నూల్,శ్రీశైలం ఎడమ గట్టు కాలువ(SLBC) సొరంగం ప్రమాదంలో సహాయక చర్యలు చివరి దశకు చేరుకున్నాయి. ప్రమాదం జరిగిన వారం రోజులకు.. ఎనిమిది మంది మృతదేహాల అవశేషాలను గుర్తించిన సంగతి తెలిసిందే. భారీగా పేరుకుపోయిన బురదను తొలగించి.. మృతదేహాలను వెలికి తీసే పనిలో సహాయక బృందాలు ఉన్నాయి.ప్రమాదం జరిగిన స్థలంలో 200 మీటర్ల పొడవు, 9.2 మీటర్ల ఎత్తులో బురద, మట్టి, రాళ్లు పేరుకుపోయాయి. శుక్రవారం రాత్రి.. జీపీఆర్, అక్వాఐతో బురదలో ఊరుకుపోయిన అవశేషాలను గుర్తించగలిగారు. మట్టిని తొలగించి మృతదేహాలను బయటకు తీసే ప్రయత్నాల్లో ఉన్నాయి. లోకో ట్రైన్‌ను 13.5 కిలోమీటర్ వరకు తీసుకొచ్చి.. బంధువుల సాయంతో మృతదేహాలను గుర్తించాలనుకుంటున్నారు.ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద ఎనిమిదో రోజు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. NDRF, SDRF, ఆర్మీ, నేవీ, సింగరేణి, ర్యాట్ హోల్ మైనర్స్, రైల్వే రెస్క్యూ టీంలు పాల్గొంటున్న సంగతి తెలిసిందే. ప్రమాదం జరిగిన ప్రాంతం నుంచి బురదను డబ్బాల్లో బయటకు పంపుతూనే ఉన్నారు.మరోవైపు టన్నెల్ వద్దకు ఉస్మానియా ఫోరెన్సిక్ బృందం చేరుకుంది. ఫోరెన్సిక్ డిపార్ట్‌మెంట్ హెడ్ శ్రీధర్ చారితో పాటు ఇద్దరు సిబ్బంది, మరో ఇద్దరు పీజీ వైద్యులు, నాగర్ కర్నూల్ డీఎంహెచ్‌వో కూడా టన్నెల్ వద్దకు చేరుకున్నారు. కార్మికుల కుటుంబాల రోదనలతో టన్నెల్ వద్ద విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇవాళ ఎలాగైనా మృతదేహాలను వెలికి తీసి.. బంధువులకు అప్పగించాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు. మృతదేహాల గుర్తింపు కోసం బంధువులను లోపలికి తీసుళ్లేందుకు జేపీ కంపెనీ లోకో ట్రైన్ సిద్ధం చేస్తోంది.

**ఐదు రోజులెందుకు పట్టింది?: బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి**

టన్నెల్ కట్టింగ్ చేయలనీ నిర్ణయం తీసుకోవడానికి 5 రోజులు సమయం ఎందుకు పట్టిందని బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి ప్రశ్నిస్తున్నారు. ఆయన నేతృత్వంలో ఇవాళ బీజేపీ ఎమ్మెల్యేలు SLBC ప్రమాద ఘటన స్థలాన్ని పరిశీలించేందుకు బయలుదేరారు. ఈ నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. SLBC ఘటన బాధాకరం. సంఘటన స్థలానికి సీఎం వెళ్లకపోవడం దురదృష్టకరం. మంత్రులేమో పిక్నిక్ గా వెళ్లి వచ్చారు. కనీస ఆలోచన లేకుండా పనులు చేస్తున్నారు. నత్తనడకన నడుస్తున్న ప్రాజెక్టు ఇది. గత కాంగ్రెస్, BRS ప్రభుత్వాలు SLBC నీ నిర్లక్ష్యం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు లో కేటాయించిన నిధుల్లో సగం SLBC కి కేటాయిస్తే ప్రాజెక్టు ఈపాటికి పూర్తి అయ్యేది. ఎనిమిది మంది ప్రాణాలను ప్రభుత్వం తీసింది.. ప్రభుత్వ హత్యలే ఇవి అని మండిపడ్డారాయన.

## బీఆర్ఎస్ పార్టీకి అగ్నిపరీక్షగా.. ఎమ్మెల్సీ ఎన్నికలు



హైదరాబాద్,ఎమ్మెల్యే కోటాలో తెలంగాణలోని 5 ఎమ్మెల్సీ స్థానాలు వచ్చే నెలాఖరుతో ఖాళీ అవుతున్నాయి. ఆ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల షెడ్యూల్ కూడా విడుదలైంది. ఆ అయిదు స్థానాల్లో ఒకటి బీఆర్ఎస్ దక్కించుకోనుంది. ఆ క్రమంలో బీఆర్ఎస్‌లో శాసనసభ్యుల కోటా ఎమ్మెల్సీ ఎన్నిక హాట్ టాపిక్ గా మారింది. కేసీఆర్ ఈ సారి ఎవరికి అవకాశం ఇస్తారు? ప్రస్తుతం పదవీకాలం ముగుస్తున్న వారికే రెన్యూవల్ చేస్తారా? అనే చర్చమొదలైంది. అయితే పలువురు సీనియర్లు కూడా ఆ సింగిల్ పోస్టు కోసం పోటీ పడుతున్నారంట..ప్రస్తుత రాజకీయాల నేపథ్యంలో పార్టీ మారిన ఎమ్మెల్యేలను డిఫెన్స్ లో పడేసేలా గులాబీ బాస్ ఈ ఎన్నికలను వాడుకోవాలని చూస్తున్నారంట.

**ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానం కోసం బీఆర్ఎస్‌లో పోటాపోటీ**

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది. తెలంగాణలో అయిదు, ఆంధ్రప్రదేశ్‌లో అయిదు ఎమ్మెల్సీ స్థానాలకు మార్చి 29తో పదవీ కాలం ముగియనుంది. ఆ క్రమంలో బీఆర్ఎస్ శాసనసభ్యుల కోటా ఎమ్మెల్సీ ఎన్నిక హాట్ టాపిక్ గా మారింది. కేసీఆర్ ఈ సారి ఎవరికి అవకాశం ఇస్తారు. ప్రస్తుతం పదవీకాలం ముగుస్తున్న వారిలో ఒకరికే ఛాన్స్ ఇస్తారా? అన్న చర్చమొదలైంది. అయితే పార్టీలోని కొంత మంది సీనియర్లు కూడా ఆ పదవిపై బోల్డు ఆశలతో ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇప్పటికే దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణలను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా సిఫార్సు చేసినా.. గవర్నర్ తమిళిసై తిరస్కరించారు. దాంతో వారిని మళ్లీ ఎమ్మెల్యే కోటాలో సిఫార్సు చేస్తారా? అన్న చర్చ కూడా జరుగుతోంది. మొత్తమ్మీద కేసీఆర్ ఆశీస్సులు ఎవరికి ఉంటాయనేది అంతుపట్టకుండా తయారైంది.

**మార్చి 29కి ఖాళీ కానున్న 5 ఎమ్మెల్సీ స్థానాలు**

రాష్ట్రంలో ఎమ్మెల్యే కోటాలో 5 ఎమ్మెల్సీ స్థానాలు వచ్చే నెల 29న ఖాళీ అవుతున్నాయి. అందులో బీఆర్ఎస్‌కి చెందిన ఎమ్మెల్సీలు శేరి శుభాష్ రెడ్డి, సత్యవతి రాథోడ్, మహమూద్ అలీల పదవీ కాలం ముగుస్తుంది. బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ లో చేరిన ఎగ్గే మల్లేషం, ఎంఐఎంకు చెందిన మీర్జా రియాజ్ ఉల్ హసన్‌ల పదవీకాలం కూడా పూర్తికానుంది. ఈ ఎమ్మెల్సీ స్థానాలకు త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుంది.

**కేటీఆర్, హరీష్ రావు, కవితను కలిసి విజ్ఞప్తులు**

బీఆర్ఎస్ లో ఎమ్మెల్సీ ఆశావహుల సంఖ్య ఎక్కువగా కనిపిస్తుంది. ఎవరికి వారుగా ఎమ్మెల్సీ స్థానం కోసం ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. కేటీఆర్, హరీష్ రావు, కవితను కలిసి విజ్ఞప్తులు చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. కొంతమంది నేతలు నేరుగా ఫాం హౌజ్ కు వెళ్లి పార్టీ అధినేత కేసీఆర్ ను కలిసి తమకు అవకాశం ఇవ్వాలని వేడుకుంటున్నారంట. నోటిఫికేషన్ వెలుబడబోయే ఈ 5 స్థానాల్లో బీఆర్ఎస్ పార్టీకి ఒకస్థానం మాత్రమే దక్కనుంది. అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ పార్టీ 39 స్థానాల్లో విజయం సాధించగా, సికింద్రాబాద్ కంటోన్మెంట్ కు జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించింది.

**అసెంబ్లీలో 28కి పడిపోయిన బీఆర్ఎస్ బలం**

ఉపఎన్నికల్లో ఓటమితో బీఆర్ఎస్ బలం 38మందికి చేరింది. అందులో 10మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరడంలో అసెంబ్లీలో గులాబీ పార్టీ బలం 28కి పడిపోయింది. త్వరలో జరుగబోయే శాసనసభ్యుల కోటాలో ఒక ఎమ్మెల్సీ స్థానానికి సగటున 23 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. దీంతో బీఆర్ఎస్ కు ఒక ఎమ్మెల్సీ స్థానం దక్కడం ఖాయంగా కనిపిస్తుంది. కాంగ్రెస్, ఎంఐఎంల మధ్య సమన్వయంతో ఎంఐఎంకు ఒక స్థానం, మూడు కాంగ్రెస్ పార్టీకి మిగిలిన మూడు స్థానాలుదక్కనున్నాయి. ఆ క్రయంలో బీఆర్ఎస్ ఆ ఒక్కస్థానాన్ని ఎవరికి ఇస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

**ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీగా బీసీ నేతలకు అవకాశం కల్పిస్తారా?**

బీఆర్ఎస్ పార్టీ బీసీ వాదం అందుకుంది. బీసీలకు రాబోయే స్థానిక సంస్థలతో పాటు అన్ని ఎన్నికల్లోనూ 42శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ తెరమీదకు తెచ్చింది. కులగణన తప్పుల తడకగా అభివర్ణిస్తుంది. మరోవైపు బీసీ నేతలతో సమావేశాలు నిర్వహించి ఉద్యమ కార్యాచరణకు శ్రీకారం చుదుతుంది. అయితే త్వరలో ఖాళీ అవుతున్న ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీగా బీసీ నేతలకు అవకాశం కల్పిస్తారా? కల్పిస్తే ఎవరికి ఇస్తారు? అన్న చర్చ జరుగుతోంది.

**ఎస్సీని సీఎం చేస్తానని మాట తప్పిన కేసీఆర్**

బీఆర్ఎస్ బీసీకి ఎమ్మెల్సీ ఇచ్చి బీఆర్ఎస్ పార్టీ చిత్తశుద్ధిని నిరూపించుకుంటుందా? అన్న అనుమానాలు ఆ పార్టీ శ్రేణుల్లోనే వ్యక్తమవుతు న్నాయి . రాష్ట్ర విభజన తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లో ఎస్సీని ముఖ్యమంత్రిని చేస్తానని ప్రచారం చేసుకున్న కేసీఆర్.. చివరికి ఏం చేశారో గుర్తు చేసుకుంటున్నాయి. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ వాదంతో వెళ్లి మెజార్టీ స్థానాల్లో విజయం సాధించాలంటే ఈ ఎమ్మెల్సీ కూడా కీలకం కానుంది.

## బడ్జెట్ ప్రసంగం కాదు.. లోకేష్‌ను పొగిడే కార్యక్రమం...

విశాఖపట్నం: ఏపీలో కూటమి ప్రభుత్వం ప్రజలను నమ్మించి మోసం చేసిందన్నారు మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్. చంద్రబాబు సర్కార్‌కు హామీలు అమలు చేసే సత్తా లేదన్నారు. బడ్జెట్ ప్రసంగంలో వైఎస్ జగన్‌ను విమర్శించడం.. నారా లోకేష్‌ను పొగడటమే పనిగా పెట్టుకున్నారని చెప్పుకొచ్చారు.మాజీ మంత్రి అమర్నాథ్ విశాఖలో మీడియాతో మాట్లాడుతూ..'ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వైఎస్ జగన్ నెరవేర్చారు. కోవిడ్ సమయంలో కూడా వైఎస్ జగన్ సంక్షేమ పథకాలను అందించారు. బడ్జెట్ ప్రసంగంలో కూటమి ప్రభుత్వం వైఎస్ జగన్ జపం చేసింది. చంద్రబాబు ప్రభుత్వ బడ్జెట్ రాష్ట్ర ప్రజలను నిరాశ పరిచింది. కూటమి నేతలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించారు. హలో ఏపీ.. కూటమి పెట్టింది టోపీ.. అనే విధంగా ప్రజలు భావిస్తున్నారు. రాష్ట్ర బడ్జెట్‌పై ప్రజలు ఎంతో ఆశగా ఎదురు చూశారు. కేటాయింపుల ద్వారా తమ జీవితాలు మారుతాయని ఆశ పడ్డారు. బడ్జెట్ ద్వారా ప్రజలకు నిరాశే మిగిలింది. వైఎస్ జగన్ కంటే ఎక్కువ పథకాలు ఇస్తారని ప్రజలు భావించారు. చంద్రబాబు అంటే మోసమని మరోసారి రుజువైంది. కూటమి ప్రభుత్వం ప్రజలను నమ్మించి మోసం చేసింది. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవకు నిధుల్లో కోత పెట్టారు. తల్లికివందనం పథకానికి రూ. 13,113 కోట్లు అవసరమైతే రూ. 9,407 కోట్లు మాత్రమే కేటాయించారు. ఆడపిల్లకు వందనం, ఉచిత బస్సు, నిరుద్యోగ భృతికి అసలు నిధులే కేటాయించలేదు. వైఎస్ జగన్ విలువ ఇప్పుడు అందరికీ తెలుస్తుంది. బడ్జెట్‌లో నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కేటాయించలేదు. నిరుద్యోగులకు ఏడాదికి 7000 కోట్లు ఇవ్వాలి. 18 ఏళ్లు దాటిన మహిళకు 27000 కోట్లు ఇవ్వాలి. హామీలు దసరా, దీపావళికి అమలు చేస్తామన్నారు.. వాయిదా వేశారు. సంక్రాంతికి వస్తామన్నారు, సినిమా వచ్చింది కానీ చంద్రబాబు రాలేదు. తొలి సంతకం డీఎస్సీకి దిక్కుమొక్కు లేదు. షుగర్ ఫ్యాక్టరీ రైతులు రోడ్డుక్కె పరిస్థితి ఏర్పడింది. కూటమి పాలనపై ప్రజలు తిరగబడే పరిస్థితి వచ్చింది. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమకు నిధులు ఎందుకు



కేటాయించలేదు?. సంపద సృష్టి అనేది అమరావతి కోసమేనా?. మెట్రో రైలు, ఉత్తరాంధ్ర సృజల స్రవంతి పరిస్థితి ఏమిటి? అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేసే వరకు వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుంది' అని తెలిపారు.

## అధిక ఫీజులపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం..

హైదరాబాద్: హైదరాబాద్ హయత్‌నగర్‌లోని జీ హైస్కూల్‌లో (జీ హైస్కూల్) ఫీజుల పెంపుపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. ఒకేసారి 30 నుంచి 50 శాతం ఫీజులు పెంచడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన ఫీజులను తగ్గించాలని డిమాండ్ చేస్తూ జీ స్కూల్ వద్ద ధర్నా చేశారు. పాఠశాల నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా పాఠశాల నుంచి నేషనల్ హైవే వరకు ర్యాలీ నిర్వహిస్తున్నారు. ఫీజులను తగ్గించాలని ఇప్పటికే తాము స్కూల్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లామని, అయినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు పెంపు పరిశీలన డీఈవో, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం ఎలాంటి స్పందన లేదని, తమ సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

## సంపాదకీయం

ఆదివారం 02-03-2025

# ఎంతకాలమీ అప్పుల బాగోతం !

కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు ఆర్థిక క్రమశిక్షణ పాటించడం లేదు. ప్రతిదానికి కేంద్రం సాయం చేయాలని దేబిరిస్తున్నాయి. అదేపనిగా అప్పులు చేస్తూ ప్రజలపై భారం మోపుతున్నాయి. సంక్షేమ పథకాల పేరుతో అప్పులు చేసి వడ్డీలు కడుతున్నాయి. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో గత కెసిఆర్, జగన్ ఏలుబడిలో చేసిన లక్షల కోట్లు అభివృద్ధి పేరుతో దుబారా చేశారు. ఇప్పుడు వాటికి వడ్డీలకే వేలకోట్లు చెల్లించాల్సి వస్తోంది. ఇదంతా దుబారా కాక మరోటి కాదు. పథకాలపై సమీక్షించ కుండా ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు పోటీపడి ఉచిత పథకాలు అమలు చేస్తున్నాయి. పెన్షన్లు కూడా భారంగా మారాయి. కిలో రూపాయి బియ్యం పథకం కూడా భారంగా మారింది. వీటిపై సమీక్షించి, ధరలు పెంచాలన్న ఆలోచన చేయడం లేదు. ఇవన్నీ సమీక్షిస్తూ నెలకు కనీసం ఐదారువేల కోట్లు రూపాయలు మిగులుతాయి. తెలంగాణనే తీసుకుంటే వేల కోట్లు వడ్డీలు కట్టాల్సి వస్తోందని సిఎం రేవంత్ రెడ్డి తాజాగా చేసిన వ్యాఖ్యలు చూస్తే గత కెసిఆర్ ప్రభుత్వం చేసిన అప్పులు ఎంతగా పెరిగాయో గమనించవచ్చు. అలాగే జగన్ చేసిన అప్పులకు కూటమి ప్రభుత్వం కూడా కోలుకోలేకుండా పోయింది. అప్పులు చెల్లించే దుకు మరిన్ని అప్పులు చేసే బదులు ఖర్చులు తగ్గించుకోవచ్చు. దుబారాను అరికట్ట వచ్చు. కానీ ప్రభుత్వాలు అలా చేయడం లేదు. ప్రభుత్వ నిర్వహణ అంటే కేవలం అప్పులు చేసి, ప్రజలకు నగదు బదిలీ చేయడం అని జగన్ నిరూపించారు. రాష్ట్రాలను ఇలా దివాళా దిశగా ఉన్నాయి. ఎక్కడా అభివృద్ది కన్నా ఓట్లు రాబట్టే పథకాలే సాగుతున్నాయి. ఇందుకు ఏ రాష్ట్రం కూడా మినహాయింపు కాదు. అభివృద్ధి పక్కకు పోయింది. తెలంగాణలో కాళేశ్వరంపై తప్పులు ఒప్పుకోకుండా బిఆర్ఎస్ ఎదురుదాడికి దిగుతోంది. ఏ పథకం తీసుకున్నా అవినీతి కనిపిస్తోంది. నోరుంది కదాని బిఆర్ఎస్ నేతలు చేస్తున్న విపరీత వ్యాఖ్యలు,ఆరోపణలు జుగుప్స కలిగిస్తున్నాయి. ప్రతిపనికీ కేంద్రంపై ఆధారపడాల్సి వస్తోంది. రాష్ట్రాలు స్వయం సమృద్ధి సాధించకపోవడం వల్ల ఇలా దివాళా తీయాల్సి వస్తోంది. అయితే మోదీని ప్రశ్నించే ముందు తమ రాష్ట్రాల్లో తాము ఎంత సచ్ఛీలంగా పాలన చేస్తున్నామో ఆయా రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలు గమనించాలి. ప్రజలు చేస్తున్నవిమర్శలకు సమాధానం చెప్పాలి. అలాగని కేంద్రం చేస్తున్న ఆర్థిక దుర్వినియోగాన్ని తప్పు పట్టకుండా ఉండలేం. కేంద్రం చేస్తున్న దుర్వినియోగాన్ని, దుర్మార్గాలను ఎండగట్టాల్సిందే. అవినీతి నేతలను త్వరగా శిక్షలు పడాలి. అప్పుడే దేశంలో జవాబుదారీతనం వస్తుంది. ఎంతమంది అవినీతికి పాల్పడ్డారో వారందరినీ ఒకే గాటన కట్టివుంటే బాగుండేది. రాజకీయ అవినీతిని, కార్పోరేట్ మోసాలను అరికట్టే విషయంలో ఎవరికీ అభ్యంతరం లేదు. కానీ మోదీ మాత్రం విమర్శలను పట్టించుకోవడం లేదు. ప్రజాస్వామ్యాన్ని పట్టించుకోవడం లేదు. రాజ్యాంగ వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని ఎంతకాలం ఇలా ముందుకు వెళతారన్నది చూడాలి. సిబిఐ, ఐటి, ఇడి దాడులపై వస్తున్న ఆరోపణలను పట్టించుకోవడం లేదు. ఆయా రాష్ట్రాల్లో చిచ్చు పెట్టి అధికారాన్ని చేజిక్కించు కుంటున్న తీరు కాంగ్రెస్ పాలనకన్నా దారుణంగా ఉంది. వ్యవస్థలను భ్రష్టు పట్టించిన ఘనత కాంగ్రెస్ దయితే..అంతకుమించిన దారుణాలను ఇప్పుడు మోదీ అనుసరిస్తున్నారు. ప్రజల సమస్యలను పక్కన పెట్టే ఇలాంటి చర్యలు సమర్థనీయం కాదు. ప్రజల సమస్యలను ప్రధానంగా పరిష్కరిస్తూనే...అవినీతి నేతలను బొక్కలో వేయాల్సిందే. రాజ్యాంగ సంస్థలు అందరి విషయంలో సమన్యాయంతో వ్యవహరించాల్సిన బాధ్యత వుంది. భారత ప్రజాస్వామ్యం వదికాలాలపాటు పటిష్టంగా నిలదొక్కుకోవాలంటే రాజ్యాంగ వ్యవస్థలు పటిష్టంగా పనిచేయాలి. నిష్పాక్షికంగా నిర్ణయాలు తీసుకోవాలి. అధికారంలో ఉన్న సమయంలో అధికార పార్టీకి కొమ్ముకాసే విధంగా ఉండరాదు. ఇది ఒక్క కేంద్రం విషయంలో మాత్రమే జరగడం లేదు. రాష్ట్రాల్లో నూ ఇలాగే వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్నారు. కేంద్రాన్ని విమర్శిస్తున్న ప్రాంతీయ పార్టీల నేతలు తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కూడా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. కేంద్రంలో అధికారంలో ఏ పార్టీ ప్రభుత్వం ఉంటే అవి రాజకీయ జోక్యంతో రాజ్యాంగ సంస్థలను తమ గుప్పిట్లో పెట్టుకుంటు న్నాయి. అందుకే రాజ్యాంగ సంస్కరణలు రావాలని మేధావులు కోరుకుంటున్నారు. ప్రధానంగా వివిధ దర్యాప్తు సంస్థలు, ఎన్నికల సంఘం,ప్రణాళికా సంఘం అంటే నీతి ఆయోగ్, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, కంప్ట్రోలర్ అండ్ ఆడిట్జనరల్ వంటి అనేక సంస్థలు జవాబు దారీగా ఉండేలా పటిష్ట రాజ్యాంగం అవసరం. దేశ సమాఖ్య విధానంలో సహకార స్ఫూర్తిని పెంపొందించాల్సిన కేంద్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. భారత రాజ్యాంగ సంస్థల పట్ల విశ్వసనీయత పెరగాలి. అవి తీసుకునే నిర్ణయాలు ఏకపక్షంగా ఉండకుండా చూసుకోవాలి. అందుకు దేశవ్యాప్తంగా చర్చచేయాలి. రాజ్యాంగాన్ని అడ్డం పెట్టుకుని స్వారీ చేసే పాలకుల తీరు మారాలి. ఇలాంటి పాలకులు వస్తారని బహుశా రాజ్యాంగ రచన చేసిన వారు ఊహించి ఉండరు. అందువల్ల వ్యవస్థలను బలోపేతం చేస్తూ..రాజకీయజోక్యం లేని పాలనా సంస్థలను రూపొందించుకోవాలి. కేంద్రంలో లేదా రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీలు తమ అవసరాలకు వాటిని దుర్వినియోగం చేసే విధానాలకు చెక్ పెట్టాల్సిన అవసరం ఏర్పడింది. ప్రజలు అప్రమత్తంగా లేకుంటే పాలకులు స్వారీ చేస్తారని ప్రజలు గుర్తించాలి. ఇలా ప్రజలు నిద్రలో ఉన్నంత కాలం పాలకులు తమ విధానాలనే రుద్దుతారు. తాము చేసిందే కరెక్ట్ అని చెబుతారు. దీనిని అడ్డుకోవడం అన్నది ప్రజలు తమ కర్తవ్యంగా గుర్తించాలి.తాము అప్పగించిన అధికారం దుర్వినియోగం కాకుండా చూసుకోవాలి. నిరంతరంగా ఇలాంటి అనర్థాలపై ప్రజలు చర్చించాలి. రాజ్యాంగ వ్యవస్థల పనితీరు, పాలకుల పనితీరు, అవినీతి పాలనలపై చర్చించాలి. ఎవరు అవినీతికి పాల్పడినా తొణ శిక్షలు పడేలా చేయాలి. రాజకీయ అవినీతికి లోక్‌పాల్ లాంటి సంస్థలు రావాలి. రాజ్యాంగ పరిరక్షణలో పాలకుల అవినీతి, అక్రమాలపై మేధావులు గొంతెత్తాలి. నిరంతరం ప్రజలను జాగరూకత పర్చాలి. రాష్ట్రాలు ఆర్థిక జవాబుదారీతనంతోముందుకు సాగేలా చూడాలి. ఇష్టం వచ్చినట్లు అప్పులు చేసి, అభివృద్ధి కోసమే అంటే బోనెక్కించాల్సి రావాలి.

# హిందీ: మూడో భాష ముసుగులో చొరబాటు

న్యూఢిల్లీ,వైవిధ్యాన్ని, విభిన్నతలను రద్దు చేసి దేశం ఒకటే, దేశంలో సర్వం ఒకటే అంటూ ఆ ఒకటి ఏదో తామే నిర్ణయించి నిర్దేశిస్తున్నారు. ఈ జాతీయతకు ఒక మతం ఉన్నట్లుగానే, ఒక ప్రాంతం కూడా ఉంది. ఒకటో రెండో మూడో సామాజిక వర్గాల పునాది కూడా ఉంది. ఆ తీవ్రజాతీయతకు, దాని ద్వారా లబ్ధి పొంది సువిశాలమైన వ్యాపార మార్కెట్‌ను సృష్టించుకునే ఆర్థికవర్గాలకు ఒకే ప్రాబల్య భాష, సర్వవ్యాపిత భాష చాలా అవసరం. అందుకే గత పది సంవత్సరాలుగా చాప కింద నీరులా హిందీని విస్తరింపజేశారు.మాతృభాషలు అన్నీ సమానమే అని భారత ప్రధాని నరేంద్రమోదీ అన్నారంటే ఆ ప్రకటనకు మురిసి ముక్కలవ్వాలనిపిస్తుంది. ఆదివాసీ భాషలు అపురూపమైనవి వాటిని కాపాడుకోవాలని ఆయన అంటే, మా బంగారు తండ్రే అని మెచ్చి మొటికలు విరవాలనిపిస్తుంది. భాషల మధ్య పగలు ప్రతీకారాలు కూడదని అంటుంటే, ఆ సూక్తి ముక్తావళికి పరవశించిపోవాలనిపిస్తుంది. కానీ, ఈ సుభాషితాలు స్వచ్ఛ రంగు ధారిణేనా? లేక బంగారు వన్నెతో మెరిపిస్తున్న మాయలేడినా?మానవళి అంతా సమానంగా లేదు. అనేక హెచ్చుతగ్గులు, అగాధాలు, అంతరాలు ఉ న్నాయి. సకల రంగాలలో, తలాలలో ఉన్న ఎగుడుదిగుడులు స్వర్గలుగా, ఉ ద్యమాలుగా, తీవ్రమైన ప్రయోజనాల ఘర్షణగా పరిణమిస్తాయి. మరి ఇటువంటి ప్రపంచంలో, ఇటువంటి దేశంలో మాతృభాషలన్నీ సమానంగా ఉన్నాయా? ఉండగలవా? ఉన్నాయన్నది అమాయకపు అంచనాయా? ఒక ఆకాంక్షయా? లేక మభ్యపరిచే మాటనా?భాషల మధ్య పోటీలు, అభద్రతలు, ఉద్రిక్తతలు, అసమానతలు, ఆధిపత్యాలు ఉన్నాయంటున్నామంటే అవి కేవలం పలికే అక్షరధ్వనుల మధ్య, రాసే లిపిసంకేతాల మధ్య ఉండే సమస్యలో శత్రుత్వాలో కావు. ఆయాభాషలు మాట్లాడే ప్రజల మధ్య ఉండే అసమసంబంధాలు. భాషల అభివృద్ధి కోరుతున్నామంటే అర్థం, ఆ భాషా వ్యవహర్తల అభివృద్ధిని కోరుతున్నామని.ఆధిపత్యాలు నెరిపే మనుషుల లాగే వారి భాషలు కూడా పెత్తనం చేస్తాయి. వెనుకబడుతున్న భాషలన్నీ, యాసలన్నీ వెనుకబాటులో ఉన్న సమాజాలకు చెందినవే. భాషలకు చెందిన ఆధిక్యభావనలన్నీ ఆ భాషా వ్యవహర్తల ఆధిక్య భావనలే. అధికారభాషలన్నీ అధికారనిర్వహణకు సాధనాలే. సమాజంలోని ప్రాబల్య,శిష్ట శ్రేణుల భాషలు, యాసలు అధిక గౌరవం పొందడమే కాక, అధికార సమాచార వినిమయానికి మాధ్యమాలుగా, ప్రధాన కథనాలకు రాజభాషగా ఉంటాయి. భాషా ప్రయుక్త రాష్ట్రాల డిమాండ్‌లు అన్నీ ప్రాబల్య భాషాసమాజం కింద నలిగిపోతున్న బలహీన భాషాసమాజాల ఆకాంక్షలే. ప్రాంతీయ న్యాయాన్ని కోరిన ఉద్యమాలన్నీ భాషా సామాజిక న్యాయంలో కొరవడిన అంతర్గత న్యాయాన్ని సాధించుకునేందుకే! ఏ సందర్భంలో ఎవరిని ఉద్దేశించి భాషల సమానత్వం గురించి ప్రధాని మాట్లాడారో మొదట చూద్దాం.బక్క భాషల మీద సవారీ చేస్తున్న బాహుబలి భాషను మందలిస్తూ ఆయన ఆ మాట అనలేదు. అన్నిటినీ తొక్కుకుంటూ దూసుకువస్తున్న రథచక్రాల నుంచి తమ భాషను, అస్థిత్వాన్ని కాపాడుకోవడానికి పోరాడాలనుకుంటున్న బలహీనులకు ఆ మాటలు ఉపదేశిస్తున్నారాయన. మూడు భాషల సూత్రాన్ని అమలుచేయాలన్న జాతీయ విద్యావిధానం (2020) నిర్దేశాన్ని వ్యతిరేకిస్తూ తమిళనాడు ప్రభుత్వం, అక్కడి అధికార డిఎంకె, ప్రతిపక్ష పార్టీలు కూడా పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో మోదీ అలా మాట్లాడారు. త్రిభాషా సూత్రాన్ని అమలుచేయడానికి నిరాకరిస్తున్నందుకుగాను, తమిళనాడు ప్రభుత్వానికి సమగ్ర శిక్షా పథకం కింద రావలసిన 2 వేల కోట్లకు పైగా నిధులను కేంద్రం నిలిపివేసింది. అంటే ఆ విధానాన్ని అమలుచేయించడానికి పలు రూపాల్లో ఒత్తిడి తెస్తోంది కేంద్రం. ముఖ్యంగా ఆర్థిక ఒత్తిడిని కేంద్రం ఉ పయోగిస్తోందన్న మాట.మరి, మూడుభాషలు నేర్చుకోవడానికి ఏమిటి నెప్పి? రాజకీయ, సామాజిక కారణాలే కాక విద్యావిషయిక కారణాలుకూడా తమిళనాడు వైఖరికి కారణం. త్రిభాషావిద్య పిల్లల మీద భారం అవుతుందని, చిన్నవయస్సులో పిల్లలు విద్య మీద ఆసక్తి కోల్పోయి డ్రాప్ అవుట్ అవుతారని నిపుణులు చెబుతారు. తమిళనాడు సమాజం హిందీ వ్యతిరేక ఉద్యమాలు ఉధృతంగా చేసిన చరిత్రకలిగినది. తమిళులు ఇప్పటి దాకా రెండు భాషలు మాత్రమే నేర్చుకుంటున్నారు. అవి ఇంగ్లీషు, తమిళం. ఫలితంగా తమ విద్యార్థుల




ప్రమాణాలు బాగా మెరుగుపడ్డాయని ఆ రాష్ట్రం చెప్పుకుంటోంది. హిందీ నుంచి తమిళనాడు తనకు పెద్ద రక్షణ కవచాన్నే నిర్మించుకుంది.అయినా దేశంలో చాలాచోట్ల పదోతరగతి దాకా మూడుభాషలు నేర్చుకుంటున్నారు. తెలుగు రాష్ట్రాలలో మూడోభాషగా హిందీ తీసుకున్నా అందులో మంచి మార్కులు రావాలన్న నియమమేమీ లేదు. అదసలు నిర్ణాయకమైన సబ్జక్టే కాదు. మరి, జాతీయ విద్యావిధానం హిందీని నిజంగానే మూడుభాషలలో ఒకటిగా నిర్బంధం చేసిందా? అటువంటి ప్రయత్నం జరిగింది కానీ, కస్తూరి రంగన్ కమిటీకి తమిళనాడు నుంచి ఇతర రాష్ట్రాల నుంచి అభ్యంతరాలు వచ్చిన మీదట మాతృభాష, ఇంగ్లీషు కాక మరేదైనా భారతీయ భాషను తీసుకోవచ్చునని వెసులుబాటు ఇచ్చారు. కావాలంటే తమిళులు మూడో భాషగా తెలుగు తీసుకోవచ్చు, బెంగాలీ తీసుకోవచ్చు, పంజాబీ తీసుకోవచ్చు. హిందీయే తీసుకోవాలని ఏమీ లేదు.అన్ని భాషలూ సమానమే అని మోదీ అన్నమాటలను ఈ నేపథ్యంలో అర్థం చేసుకోవాలి. ఆ సమానత్వంలో మాయలేడి మెరుపులున్నాయేమో తెలుసుకోవాలి.మూడో భాష ఎంపికలో స్వేచ్ఛ ఉందని చెబుతున్నారు కానీ, మూడో భాషకు అవకాశమివ్వడమే హిందీ విధింపునకు దొడ్డిదారి మార్గమని తమిళులు వాదిస్తున్నారు. ఇది నిజమేనా? మూడో భాష అంటూ ఉంటే అది తప్పనిసరిగా హిందీయే అయ్యేట్టుగా పరిస్థితులున్నాయి మరి. తమిళనాడు విద్యార్థి మూడో భాషగా అస్సామీ తీసుకుంటే ఆ భాష బోధించే ఉపాధ్యాయులు దొరుకుతారా? అలాగే బెంగాలీ, ఒడియా, గుజరాతీ, రాజస్థానీ%౯% ఏదైనా కానీ ఇతర ప్రాంతాలకు వెళ్లి చెప్పే టీచర్ల లభ్యత ఉ ంటుందా? మరి హిందీ సంగతి? దేశవ్యాప్తంగా హిందీప్రచార సంస్థలున్నాయి. హిందీ చదువుకుంటే భాషోపాధ్యాయులుగా ఉద్యోగం దొరుకుతుందన్న ఆశ ఉంది. అన్నిటికి మించి కేంద్రప్రభుత్వం హిందీ ఉపాధ్యాయుల లభ్యతను పెంచడానికి బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించి చర్యలు తీసుకుంటోంది. అటువంటి కార్యక్రమం ఇతర భాషలకు ఉందా? హిందీయేతర భారతీయ మాతృభాషలకు ప్రచారం, మార్కెట్, ఉద్యోగావకాశాలు ఎంతవరకు ఉన్నాయి? కాబట్టి, త్రిభాషా సూత్రంలోని స్వేచ్ఛ నేతి బీర మాత్రమే.మాతృభాషల్లో ఉన్నత వృత్తి సాంకేతిక కోర్సులను అందుబాటులో ఉంచడం జాతీయ విద్యావిధానం అందిస్తున్న వరంగా కేంద్రప్రభుత్వం చెబుతుంది. తెలుగులోనో తమిళంలోనో డాక్టరీ, ఇంజనీరింగ్ చదువుకోగలగడం గొప్ప విషయం. ఉర్దూలో వైద్యం, ఇంజనీరింగ్ పాఠ్యాలను రూపొందించడానికి ఒకనాడు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రత్యేకంగా అనువాద విభాగం ఉండేది. ఎంతో శ్రద్ధతో సాంకేతిక పరిభాషను వాళ్లు రూపొందించారు. కానీ, ఆ కృషి మధ్యలో నిలిచిపోయింది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి హిందీని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వాలన్నీ ప్రయత్నిస్తూనే ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలన్నిటిలోనూ హిందీభాషాధికారులను నియమించారు. రోజుకో హిందీమాటను బోర్డు మీద రాసి పెట్టడం వారి విధుల్లో ఒకటి. హిందీ పక్షోత్సవాలు పేరుతో ప్రతి ఏటా ప్రతి కేంద్ర ప్రభుత్వ సంస్థ లోనూ కార్యక్రమాలు జరుగుతాయి. బ్యాంకుల్లో, కేంద్ర సంస్థల్లో ప్రతి ఫారమ్, ప్రతి డాక్యుమెంటు హిందీలో కూడా రూపొందించవలసిందే. హిందీ సంస్థలు, సంస్థానాలు వివిధరంగాల అంశాలను హిందీలో చెప్పడానికి అదే పనిగా కృషి చేస్తూ వస్తున్నాయి.కొత్త విద్యావిధానం ప్రకారం, సాంకేతిక, వృత్తి విద్యాకోర్సులను మాతృభాషలలో నేర్చుకోవడం అన్నది హిందీకి మాత్రమే సులభ సాధ్యమయ్యే విషయం.

# ముంబై, హైదరాబాద్‌లకు దీటుగా అమరావతి

అమరావతి,రూ. 3.22 లక్షల కోట్లతో ఏపీ శాసనసభలో 2025-26 వార్షిక బడ్జెట్‌ను ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి గా పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఇందులో వ్యవసాయానికి రూ. 48వేల కోట్లు కేటాయించారు. రెవెన్యూ వ్యయం రూ. 2,51,162 కోట్లు, మూలధన వ్యయం అంచనా రూ. 40,635 కోట్లు, రెవెన్యూ లోటు రూ. 33,185 కోట్లు, ద్రవ్య లోటు రూ. 79,926 కోట్లుగా అంచనా వేశారు. అన్నదాత సుఖీభవ కోసం రూ. 6,300 కోట్లు,పోలవరం ప్రాజెక్టు కోసం రూ. 6,705 కోట్లు కేటాయించారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా మంత్రి పయ్యావుల మాట్లాడుతూ.. రాష్ట్ర రుణ సామర్థ్యం సున్నాకు చేరుకుందని.. అప్పు తీసుకొనే శక్తి లేని ఏకైక రాష్ట్రంగా ఏపీ మిగిలిందని అన్నారు. అయినప్పటికీ సీఎం చంద్రబాబు స్ఫూర్తితో బడ్జెట్ రూపొందించినట్లు చెప్పారు. 2014-19 మధ్య రాష్ట్రం రెండంకెల వృద్ధి సాధించిందన్నారు. సవాళ్లను ఎదుర్కోవడంలో చంద్రబాబు.. ఆయనకు ఆయనే సాటి అని అన్నారు. రాష్ట్ర విభజన కారణంగా రాజధాని ని కోల్పోయిన ఏపీకి అమరావతిని ప్రజా రాజధానిగా చేసుకున్నామన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణం గా అమరావతి పనులు పెద్దఎత్తున చేపడతామని చెప్పారు. మహారాష్ట్రకు ముంబయి, తెలంగాణకు హైదరాబాద్ ఎంత ముఖ్యమో.. మనకూ అమరావతి అంతే ముఖ్యమన్నారు. ప్రధాని మోదీ సహకారంతో ముంబయి, హైదరాబాద్ నగరాలకు సరితూగేలా అమరావతిని అభివృద్ధి చేస్తామని పయ్యావుల వెల్లడించారు. తన ప్రసంగంలో మొదట గత పాలనలో జరిగిన ఆర్థిక విధ్వంసాన్ని వివరించిన మంత్రి పయ్యావుల కేశవ్ ,ఆ తరువాత రాష్ట్ర అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం చేపట్టిన అనేక కార్యక్రమాలను వెల్లడించారు. గత ప్రభుత్వం నిర్ణయాల వల్ల రాష్ట్రం ఏ మేరకు నష్టపోయిందో, అభివృద్ధిలో ఎలా తిరోగమనం చెందిందో తెలిపారు. ఇదిలా ఉండగా.. తన బడ్జెట్‌ప్రసంగంలో డ్రాప్ అవుట్స్ కాన్సెప్ట్‌తో ఆకట్టుకున్నారు మంత్రి. గత ప్రభుత్వంలో స్కూళ్లల్లో విద్యార్థుల డ్రాప్ అవుట్సే కాదు.. చాలా రంగాల్లో డ్రాప్ అవుట్స్ జరిగాయన్నారు. పరిశ్రమలు డ్రాప్ అవుట్ అయ్యాయని.. రాష్ట్రం నుంచి ఉద్యోగాలు డ్రాప్ అవుటయ్యాయని... పేదలకు ఉపాధి డ్రాప్ అవుట్ అయిందని వెల్లడించారు. గత ప్రభుత్వ పాలకులు ఇప్పుడు ఓటమితో.. సభకు రాకుండా.. అసెంబ్లీ నుంచి కూడా డ్రాప్ అవుట్ అయ్యారని సెటైర్ విసిరారు. వైసీపీ ఎమ్మెల్యేలు, నేతలు ప్రజా జీవితం నుంచి శాశత్వంగా డ్రాప్ అవుట్ అయ్యే రోజులు అతి త్వరలోనే ఉన్నాయంటూ పయ్యావుల కేశవ్ ఛలోక్తులు విసిరారు. అలాగే బడ్జెట్ ప్రసంగంలో ప్రధాని నరేంద్ర మోడీ, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ పేర్లను మంత్రి ప్రస్తావించారు. ఆయా సందర్భాల్లో వారు మాట్లాడిన కామెంట్లను.. తీసుకుంటున్న చర్యలను ప్రసంగంలో తెలిపారు. చెత్త పన్నుపై అయ్యన్న కామెంట్లు గుర్తు చేయడంతో అప్పటి అయ్యన్న కామెంట్లను సభ్యులు చర్చించుకున్నారు.స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రతిపక్షంలో ఉండగా చెత్త పన్ను వేసిన గత పాలకులపై చేసిన కామెంట్లు సంచలనం సృష్టించాయని మంత్రి తెలిపారు. అప్పులనే కాదు.. చెత్తను వారసత్వంగా ఇచ్చింది గత ప్రభుత్వం అంటూ మండిపడ్డారు. చెత్త పన్ను వేయడమే కాకుండా.. 83 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను ఎత్తకుండానే వైసీపీ ప్రభుత్వం వెళ్లిపోయిందంటూ మంత్రి వ్యాఖ్యలు చేశారు.అలాగే స్వర్గీయ ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన రూ. 2కే కిలో బియ్యం పథకం గురించి కూడా పయ్యావుల బడ్జెట్‌లో ప్రస్తావించారు. కాలే కడుపునకు పట్టెడన్నం పెట్టేందుకు ఎన్టీఆర్ రూ. 2కే కిలో బియ్యం పథకం ప్రారంభిం చారని గుర్తుచేశారు. ఆ సంక్షేమ పథకమే జాతీయ స్థాయిలో చట్టంగా మారిందని... అదే ఆహర భద్రత చట్టమని మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. ఇకపోతే బడ్జెట్‌లో కేటాయింపులు ఇలా ఉన్నాయి. నైపుణ్యాభివృద్ధి శిక్షణశాఖకు రూ. 1,228 కోట్లు, పాఠశాల విద్యాశాఖకు రూ. 31,805 కోట్లు, ఉన్నత విద్యకు రూ. 2,506 కోట్లు,ఎస్సీల సంక్షేమానికి రూ. 20,281 కోట్లు,ఎస్టీల సంక్షేమానికి రూ. 8,159 కోట్లు, బీసీల సంక్షేమానికి రూ. 47,456 కోట్లు, అల్పసంఖ్యాక వర్గాల కోసం రూ. 5,434 కోట్లు, మహిళా శిశు సంక్షేమం, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమం కోసం రూ. 4,332 కోట్లు, వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమానికి రూ. 19,264 కోట్లు, పంచాయతీ రాజ్ శాఖకు రూ. 18,847 కోట్లు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు రూ. 13,862 కోట్లు, గృహ నిర్మాణ శాఖకు రూ. 6,318 కోట్లు, జలవనరు ల శాఖకు రూ. 18,019 కోట్లు, పరిశ్రమలు, వాణిజ్య శాఖకు రూ. 3,156 కోట్లు,ఇంధన శాఖకు రూ. 13,600 కోట్లు, ఆర్అండ్‌బీకి రూ. 8,785 కోట్లు, యువజన, పర్యటక, సాంస్కృతిక శాఖకు రూ. 469 కోట్లు, గృహ మంత్రిత్వ శాఖకు రూ. 8,570 కోట్లు, తెలుగు భాష అభివృద్ధి,

# కులగణనపై జేపీ వాదన అసంబద్ధం!



హైదరాబాద్,'కులగణనపై బహిరంగ సవాల్' పేరుతో ప్రసారమైన ఒక టీవీ చర్చా కార్యక్రమంలో పాల్గొన్న రిటైర్డ్ ఐఏఎస్, ప్రైవేటీకరణ ప్రవక్త జయప్రకాశ్ నారాయణ.. కులగణన వలన దేశానికి ఒరిగే మేలు ఏ మాత్రం లేదంటూ కొత్త భాష్యం పలికారు. దాని వల్ల ప్రజలకూ ఒరిగేది ఏం లేదని ఘంటాపథంగా తేల్చేసారు.నేను నిశ్చయంగా చెబుతున్నాను, సవాల్ చేస్తున్నా ను.. అంటూ ఈ అంశంపై ఆయన కరాఖండిగా చెప్పేసారు. అయితే ఆయన తెలిసీ దాటవేస్తున్నారు కానీ.. గణాంకాల సేకరణ ఆధునిక ప్రభుత్వాలు చేపట్టాల్సిన ఒక శాస్త్రీయ ప్రక్రియ. ఎవరికి నచ్చినా, నచ్చకపోయినా.. దేశంలో నెలకొన్న పరిస్థితిని గణాం కాలు తేల్చిచెబుతాయి.

### మేధావి ట్యాగ్‌లైన్ అతికించుకుని..

పదేళ్లకోసారి సాగే జనాభా లెక్కల్లో.. మతాల వారీ లెక్కలను, వివిధ భాషలను మాట్లాడేవారి జనాభా ఎంతో సైతం తేలుస్తున్నారు. జనాభా లెక్కల్లో మతాల లెక్కలు, భాషా సమూహాల లెక్కలతో ఎలాంటి ఫాయిదా ఒరగదంటూ గతంలో జేపీ ఎక్కడా వాదించిన దాఖలాలు లేవు. కానీ నేడు దేశవ్యాప్తంగా చర్చనీయాం శమైన కులగణనపై.. పాలకవర్గాలకు ఉపకరించే 'సమ్మతి తయారీ' పనిలో ఆయన నిమగ్నమైనట్టున్నాడు. నేడు మనం సత్యానంతర యుగంలో జీవిస్తున్నాం. కనబడినది కనబడదని వినబడినది వినబడదని.. అంతా మిథ్య అనే దబాయింపు నేడిక్కడ రివాజుగా మారింది. మేధావులు అనే ట్యాగ్‌లైన్లు అతికించుకున్నవారు.. పాలకవర్గాల దుర్నీతులకు వంత పాడే నేరేటివ్స్‌ని ప్రచారంలో పెట్టే పనిలో బిజీగా ఉన్నారు. రిటైర్డు ఐఏఎస్ జయప్రకాశ్ నారాయణ ప్రజల గోసలు పట్టించుకోని మేధావిగా ఇప్పటికే పేరు ప్రఖ్యాతులు గాంచారు. తాజాగా.. నేడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన కులగణనపై.. పాలకవర్గాలకు ఉపకరించే 'సమ్మతి తయారీ' పనిలో ఆయన నిమగ్నమైనట్టున్నాడు.

### సమతా స్ఫూర్తి వ్యతిరేక ప్రవక్తలు..

1931 వరకు మన దేశంలో కుల గణన జరిగేది. నేటికి సైతం జనాభా లెక్కల్లో భాగంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల కులగణన సాగుతున్నది. కొత్తగా తీసేవి.. బీసీ, ఇతర వర్గాల లెక్కలు మాత్రమే. ప్రజలలోని ఆయా వర్గాల జనాభా లెక్కలు, సామాజిక ఆర్థిక స్థితిగతులు సేకరిస్తేనే ప్రభుత్వం చేపట్టే సంక్షేమ చర్యలకి దిశా నిర్దేశం ఒనగూరుతుందన్న ప్రాథమిక విషయం ఐఏఎస్‌గా వ్యవహరించిన జేపీ సాబ్‌కు తెలియదా? రిజర్వేషన్లను 'రాయితీలు' అంటున్నారాయన. రాయితీ అనే మాటను సామాజిక న్యాయవాదులు సైతం ఒప్పుకుంటారు. అయితే ఆ రాయితీ ఏదో దయతోనో, బిక్షగానో ఇచ్చేది కానే కాదు. జేపీ ఆరోపించినట్లుగా రాజకీయ సమీకరణల కోసం కూడా ఇచ్చేది కాదు. రాజ్యాంగ నిర్మాతలను రాజకీయ ప్రలోభాలు ఆవహించలేదన్న విషయాన్ని జేపీ గుర్తెరగాలి. గతంలో జరిగిన చారిత్రక తప్పిదాలను సవరిస్తేనే నేటి కాలంలో సమానత్వం వర్ధిల్లుతుంది, సమాజం ఐక్యతతో ముందుకు పోతుందని గుర్తించిన రాజ్యాంగ నిర్మాతలు.. రిజర్వేషన్ల వ్యవస్థకు రాజ్యాంగంలో చోటు కల్పించారు. ఆ సమతా స్ఫూర్తి నేటి ప్రైవేటీకరణ ప్రవక్తలకు అర్థం కాదు లెండి!

### సుప్రీంకోర్టు తీర్పునూ గుర్తించరా?

కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ చెప్పారు కాబట్టే తెలంగాణలో కులగణన జరిగిందంటూ జేపీ చేస్తున్న ప్రచారం.. ఆ డిమాండ్‌పై గత 15 సంవత్సరాలుగా ఉద్యమిస్తున్న బడుగు వర్గాలను అవమానించడమే అవుతుంది. ప్రజల నుండి వచ్చిన డిమాండ్ మేరకు రాహుల్ గాంధీ నిర్ణయం తీసుకున్నారనేది సత్యం. ఆ డిమాండ్ ప్రజలది, రాజకీయ నాయకులది కాదు. రిజర్వేషన్లకు కులగణనకు సంబంధం లేదనే జేపీ గారి వాదన సైతం అసంబద్ధమే. ఈరోజు జనాభా లెక్కల్లో ఎస్సీ, ఎస్టీల లెక్కలు తీసి.. ఆ గణాంకాల వెలుగులోనే.. వారి రిజర్వేషన్ల కొనసాగింపు ఆమోదింపబడుతున్నది. అలాగే మండల్ కమిషన్ మొదటిసారిగా బీసీల రిజర్వేషన్ల ప్రతిపాదన తీసుకొచ్చినప్పుడు బీసీ వర్గాల లెక్కలను కూడా శాస్త్రీయంగా ప్రభుత్వాలు తేల్చాలంటూ ఆదేశించింది. అందుకనే 1990 నుండి బీసీల కుల గణన డిమాండ్ ప్రజల్లో ప్రచారంలోకి వచ్చింది. లెక్కలు లేకుండా రిజర్వేషన్ల కొనసాగింపు సమ్మతం కాదని సుప్రీంకోర్టు తేల్చిన విషయం జేపీ దృష్టికి రాలేదా ఏమిటి?

### బీజేపీపై వల్లమాలిన ప్రేమ ఎందుకు?

నిత్యం అభివృద్ధి మంత్రం జపించే జేపీ.. అభివృద్ధికి వ్యతిరేకమంటూ మత రాజకీయాలను విమర్శించిన దాఖలాలు ఎక్కడా కనబడవు. గుళ్ల చుట్టూ దేవుళ్ళ చుట్టూ రాజకీయాలు నడుపుతున్న బీజేపీని.. "ప్రజలెవరూ అడగనప్పుడు ఎందుకు ఇలా చేస్తున్నారు?" అంటూ జేపీ ప్రశ్నించిన దృష్టాంతం ఒక్కటైనా ఉ న్నదా? బీజేపీ పార్టీ నడుపుతున్న మత రాజకీయాలు మాత్రం దేశ ప్రజలకు మేలు చెయగలవని జేపీ చెప్పదలుచుకున్నారా? బీజేపీకి, ఎన్డీఏ కూటమికి ఎన్నో మార్లు బహిరంగంగా మద్దతు ప్రకటించారు జయ ప్రకాష్. పోయిన ఏడాది ఏపీ ఎన్నికల్లో సైతం ఆయన ఎన్డీఏకు మద్దతుగా ప్రచారం చేశారు. దేశ ఐక్యతకు విఘాతం కలిగించే రాజకీయాలని ప్రశ్నించడానికి ముందుకు

# టారిఫ్‌ల కత్తి!

న్యూఢిల్లీ,అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ హెచ్చరికలకు కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు తలొగ్గినట్టే కనిపిస్తున్నది. తమ దేశ వస్తూత్పత్తులపై అధిక సుంకాలను వేస్తున్న దేశాలకు ప్రతీకార సుంకాలు తప్పవని అగ్రరాజ్య అధ్యక్షుడు ఈమధ్య కాలంలో పదేపదే చెప్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో భారత్‌కూ సుంకాల పోటు ఉంటుందని ఇటీవలి అమెరికా పర్యటనలో ప్రధాని మోదీకి ట్రంప్ నిర్మొహమాటంగా చెప్పిన సంగతీ విదితమే. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైనట్టు తెలుస్తున్నది. ఇందులో భాగంగానే అమెరికా నుంచి భారత్‌కు వస్తున్న వివిధ రకాల దిగుమతులపై ప్రస్తుతం విధిస్తున్న సుంకాలను తగ్గించేందుకున్న అవకాశాలను అన్వేషిస్తున్నట్టు సంబంధిత అధికార వర్గాలు చెప్తున్నాయి.

### ఇదీ సంగతి..

కార్లు, మోటర్‌సైకిళ్లు తదితర ఆటోమొబైల్స్, వ్యవసాయ ఉత్పత్తులు, రసా యనాలు, కీలక ఔషధాలు, కొన్ని వైద్య పరికరాలు, ఎలక్ట్రానిక్స్, విస్కీసహా మరికొన్నింటిపై వసూలు చేస్తున్న సుంకాలను తగ్గించే వీలుందంటున్నారు. తద్వారా అమెరికా అధిక సుంకాల నుంచి తప్పించుకోవచ్చన్న అభిప్రాయాలను వారు వ్యక్తం చేస్తున్నారు. నిజానికి కేంద్ర ప్రభుత్వం.. అమెరికా సుంకాలను తప్పించుకోవడానికి ఇప్పటికే నిర్దేశించుకున్న సుంకాల కోత కంటే ఇంకా ఎక్కువగానే టారిఫ్‌లను తగ్గించాల్సి రావచ్చన్న అంచనాలను వారు వెలిబుచ్చుతుండటం గమనార్హం. దీంతో చాలారకాల వస్తు, సేవల దిగుమతులపై పెద్ద ఎత్తునే సుంకాలు తగ్గవచ్చని చెప్తున్నారు.

### అమెరికాతో మైత్రి

ప్రస్తుతం అమెరికా సుంకాల హెచ్చరికలు.. యావత్తు ప్రపంచ వాణిజ్యాన్నే వణికిస్తున్నాయి. ఇప్పటికే స్టాక్, కరెన్సీ, కమోడిటీ మార్కెట్లపై ఆ ప్రభావం కనిపిస్తున్నది చూస్తూనే ఉన్నాం. ఈ క్రమంలో ఆయా దేశాలతోపాటు భారత్ సైతం అమెరికాతో స్నేహపూర్వక వాతావరణానికి ప్రయత్నిస్తున్నది. ముఖ్యంగా చైనాతో వాణిజ్య యుద్ధానికి ట్రంప్ కాలుదువ్వుతున్న నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ఉన్న అవకాశాలను భారత్ అందిపుచ్చుకునేందుకు చొరవ చూపాలని మెజారిటీ ఆర్థిక నిపుణులు సలహా ఇస్తున్నారు. నిజానికి గ్లోబల్ మార్కెట్‌లో చైనాకు చెక్ పెట్టాలంటే భారత్‌ను ప్రోత్సహించడమే మార్గమని అమెరికా సైతం భావిస్తున్నది. దీంతో అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్యం బలోపేతంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారిస్తున్నది.

## పోసానికి 14 రోజుల రిమాండ్

రైల్వే కోడూరు, వైకాపా నేత, సినీనటుడు పోసాని కృష్ణమురళికి అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. గురువారం రాత్రి 9.30 గంటల నుంచి శుక్రవారం ఉదయం 5 గంటల వరకు ఇరుపక్షాల మధ్య సుదీర్ఘంగా వాదనలు కొనసాగాయి. పోసాని తరఫున పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. బీఎన్ఎస్ చట్టం ప్రకారం పోసానికి 41ఏ నోటీసులు ఇచ్చి బెయిల్ ఇవ్వాలని పొన్నవోలు కోర్టును కోరారు. అందుకు నిరాకరించిన మెజిస్ట్రేట్ 14 రోజుల వరకు రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. మార్చి 12 వరకు పోసాని రిమాండ్‌లో ఉండనున్నారు. పోసానిని రాజంపేట సబ్ జైలుకు తరలించారు. కులాలు, సినీ అభిమానులు, రాజకీయ పార్టీల మధ్య విద్వేషాలు, వైషమ్యాలు రెచ్చగొట్టేలా వ్యవహరించారంటూ కేసు నమోదైంది. ఓబులవారిపల్లె మండలం కొర్లకుంటకు చెందిన జనసేన నాయకుడు జోగినేని మణి ఫిబ్రవరి 24న పోసానిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోసానిపై వివిధ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో 26న పోసానిని హైదరాబాద్‌లో ఆయన నివాసంలో పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం ఆయనను ఓబులవారిపల్లె పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మీరు చూపించిన రికార్డుల్లోని బూతు మాటలన్నీ నావే. నేను తప్పు చేశాను. ఇలా మాట్లాడి ఉండకూడదు. ఇపుడు పశ్చాత్తాపపడుతున్నా. ఇంతకంటే నేను చేసేది, చెప్పేది ఏమీ లేదని పోసాని కృష్ణమురళి అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఎదుట అంగీకరించారు. విచారణలో తొలుత ఏ ప్రశ్న అడిగినా.. 'తెలియదు.. గుర్తులేదు' అంటూ సమాధానమిచ్చారు. వైకాపా హయాంలో, కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పోసాని చేసిన అనుచిత వ్యాఖ్యలు, బూతులున్న వీడియోలన్నీ చూపించిన పోలీసులు ఇవి చట్టవిరుద్ధం కాదా? అంటూ ప్రశ్నించగా... ప్రతిదానికీ 'లెవ్ యా రాజా' అంటూ వింతగా జవాబులిచ్చారు. దర్యాప్తు అధికారులు లోతుగా ప్రశ్నించగా.. ఆ మాటలన్నీ తనవేనని, తాను నేరం చేశానని అంగీకరించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్‌ను ఎందుకు తిట్టాల్సి వచ్చింది? వారి కుటుంబసభ్యుల్ని సైతం ఎవరైనా అనుచితంగా మాట్లాడాలని ప్రోత్సహించారా అని అడగ్గా మౌనం దాల్చారు. ఒకోసారి 'అవును రాజా... చెప్పారు మాటలు విన్నా' అని చెప్పారు. తన వ్యాఖ్యల వ్యవహారం ఇంతవరకు వస్తుందని తెలియక తప్పు చేశానంటూ పోలీసులకు చెప్పారు. పోలీసులు విచారణను వీడియో, ఆడియో రికార్డింగ్ చేశారు. ఈ విచారణ నివేదికను కోర్టులో మెజిస్ట్రేట్‌కు సమర్పించారు.

## వృద్ధులను కూడా వదలని అత్యాచారనిందితుడు

పుణె,ఒంటరి వృద్ధులను టార్‌ఎట్ చేసి వారివద్ద ఉన్న నగదు, నగలను బెదరించి లాక్కోవడంలోనూ అత్యారా నిందితుడు సిద్ధహస్తుడని తేలింది. నగలతో కనిపించిన పలువురు వృద్ధులను తన ట్యాక్సీలో ఎక్కించుకొని, నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి వారిని బెదిరించి.. దోపిడీలకు పాల్పడేవాడని పోలీసులు తెలిపారు. పుణెలోని స్వర్‌గేటు బస్టాండ్ వద్ద 26 ఏళ్ల యువతిపై బస్సులో అత్యాచారానికి పాల్పడిన ఘటనలో మహారాష్ట్ర పోలీసులు నిందితుడు రామ్‌దాస్‌ను పట్టుకున్నారు. ఈక్రమంలో నిందితుడి గురించి కీలక విషయాలు వెల్లడవుతున్నాఇయి. నిందితుడు నేర స్వభావం కలవాడని.. పలు చోరీలకు పాల్పడ్డాడని పోలీసులు పేర్కొన్నారు. 2019లో ఓ ట్యాక్సీ కొనుగోలు చేసినప్పటినుంచి పుణె-అహల్యనగర్ మార్గంలో తిప్పుతున్నట్లు విచారణలో తేలిందని అన్నారు. అప్పటినుంచి అతడు నిందితుడిపై దొంగతనం, దోపిడీ, చైన్‌స్నాచింగ్ మొదలైన పలు కేసులు ఉన్నట్లు గుర్తించామన్నారు. 2019లో ఓ నేరం కేసులో జైలు శిక్ష అనుభవించి.. ప్రస్తుతం బెయిల్‌పై బయట ఉన్నట్లు తెలిపారు. అంతేకాకుండా అతడు తరచూ స్వర్‌గేటు బస్టాండ్ వద్ద తిరుగుతూ.. అక్కడికి వచ్చిన ప్రయాణికులకు తనను తాను పోలీస్‌గా పరిచయం చేసుకునేవాడని అన్నారు. యువతిపై అత్యాచారానికి ముందు కూడా నిందితుడు ఇన్‌షర్ట్ వేసుకొని.. చాలా నీట్‌గా రెడీ అయ్యాడని, ఆమెకు కూడా తనను పోలీసుగా పరిచయం చేసుకొని, అక్క అని సంభోదిస్తూ నమ్మించాడని పేర్కొన్నా రు. పుణెలోని స్వర్‌గేట్ ప్రాతంలోని బస్‌స్టాప్ వద్ద మంగళవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో స్వగ్రామానికి వెళ్లేందుకు బస్‌స్టేషన్‌కు చేరుకున్న యువతిని తన గ్రామానికి చెందిన బస్సు మరోచోట ఉందని నిందితుడు రామ్‌దాస్ నమ్మించాడు. అనంతరం కొద్ది దూరంలో ఉన్న బస్సులోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున నిరసనలు చెలరేగాయి. పోలీసులు 75 గంటల పాటు శ్రమించి పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకొన్నారు.

## యూటీఎస్ ద్వారా టికెట్ తీసుకుంటే 3-శాతం క్యాష్‌బ్యాక్

హైదరాబాద్, రైల్వే ప్రయాణికులకు అన్‌రిజర్వ్‌డ్ టికెటింగ్ సిస్టం(యూటీఎస్) యాప్ ద్వారా టికెట్లు తీసుకుంటే 3 శాతం క్యాష్ బ్యాక్ వంటి సేవలు కల్పించింది దక్షిణ మధ్య రైల్వే. వినియోగదారుడికి అనుకూలమైన డిజిటల్ పద్ధతులను ప్రవేశపెట్టడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఊరెళ్లేందుకు రైల్వే స్టేషన్‌కు రావడం బుకింగ్ కౌంటర్ వద్ద రద్దీ ఉండడం చూసిన కొందరు ఏటీవీఎం (ఆటోమెటిక్ టికెట్ వెండింగ్ మిషిన్)లను ఆశ్రయిస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు 2016లో హైదరాబాద్ జంట నగరాల్లో 26 సబర్బన్ స్టేషన్‌లలో జోన్ వారీగా యూటీఎస్ మొబైల్ ఆప్లికేషన్‌ను ప్రశేపెట్టింది. 2018 జూలైలో రైల్వేలోని అన్ని స్టేషన్లను యూటీఎస్ కవర్ చేస్తూ ప్లాట్ ఫాం ప్రయాణ టికెట్లు బుకింగ్ కోసం అన్ని నాన్-సబర్బన్ స్టేషన్లకు ఈ సౌకర్యం విస్తరించబడింది. ఆధునిక టికెట్ వ్యవస్థలో యూటీఎస్ యాప్ ప్రయాణికులకు సులువుగా మారింది. రైల్వేలో రిజర్వ్ చేయని టికెట్లపై ప్రయాణించే వారికి ఇదోక వరమని చెప్పవచ్చు. డిజిటల్ ఇండియా విధానానికి అనుగునంగా ఈ యాప్ నగదు రహిత లావాదేవీలను అనుమతిస్తుంది. అదే విధంగా ప్రయాణికులకు సులువుగా ఉండేందుకు ఆర్-వాలెట్, పేటీఎం, ఫోన్‌పే, గూగుల్‌పే, లేదంటే ఇంటర్నెంట్ బ్యాకింగ్ వంటి డిజిటల్ మోడ్‌ల ద్వారా చెల్లించేందుకు వెసులుబాటు కల్పించారు. ప్రయాణికులకు ఇష్టం ఉంటే రూ. 20 వేల వరకు డిపాజిట్ చేసుకునే విధంగా సౌకర్యాల్ని కల్పించారు. ఆర్ వాలెట్ ద్వారా టికెట్లు కొనుగోలు చేసుకునే ప్రయాణికులకు రైల్వే యంత్రాంగం 3 శాతం క్యాష్ బ్యాక్ ఇస్తున్నారు. ఆన్‌లైన్ టికెట్ల కొనుగోలు విషయంలో రోజు రోజుకు విక్రయాలు క్రమంగా పెరుగుతున్నాయి. యూటీఎస్ యాప్ ద్వారా 2023-24లో ఏప్రిల్ నుంచి జనవరి వరకు ఒక రోజులో 83.510 మంది ప్రయాణికులు సేవలు వినియోగించుకున్నారు. 2024-25 ఏడాదిలో ప్రతి రోజుకు 93,487 ప్రయాణికులు ఆన్‌లైన్ సేవలు వినియోగించుకున్న క్రమంలో 12 శాతం పెరిగిందని రైల్వే అధికారులు ప్రకటించారు. స్మార్ట్‌ఫోన్ ఉన్న వారు దాదాపు రైలు ప్రయాణం కోసం ఇంటి నుంచే ఆన్‌లైన్ సేవలు వినియోగించుకు ంటున్నారు. స్మార్ట్‌ఫోన్‌లో యూటీఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని టికెట్ కొనుకుని సులువుగా రైలు ప్రయాణం చేయవచ్చు. లేదంటే ప్రయాణికులు నేరుగా బుకింగ్ కౌంటర్ వద్దకు వచ్చి కౌంటర్ల వద్ద యూటీఎస్ క్యూ ఆర్ కోడ్‌ను వినియోగించుకోవచ్చు.

# పునర్విభజన పేచీ తేల్చేదెలా?

న్యూఢిల్లీ,ఎప్పటినుంచో చర్చకొస్తున్న నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ అంశంపై ఎట్టకేలకు కేంద్ర హెూంమంత్రి అమిత్ షా నోరువిప్పారు. ఈ ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగబోదని హామీ ఇచ్చారు. దీనిపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని కూడా అన్నారు. ఏ విషయమైనా వివాదాస్పదమైనప్పుడు వెంటనే వివరణనిచ్చి సందేహాలను తొలగించటం ప్రభుత్వాల బాధ్యత. 2023 సెప్టెంబర్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ సందర్భంగా డీఎంకే నాయకురాలు కనిమొళి దీన్ని ప్రస్తావించారు. జనాభా ప్రాతిపదికన పునర్విభజన ప్రక్రియ అమలు చేస్తే దక్షిణాదికి, ముఖ్యంగా తమిళనాడుకు అన్యాయం జరుగుతుందని ఆమె తెలిపారు. ఆ సమస్యే తలెత్తదని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. ఇప్పుడు అమిత్ షా అయినా, గతంలో మోదీ అయినా అన్యాయం జరగబోదని వాగ్దానం చేస్తున్నారు. మంచిదే. మరైతే పునర్వి భజన ఎలా ఉండబోతోంది? ఏ ప్రాతిపదికన చేస్తారు? అది చెప్పనంత కాలమూ ఈ సంశయాలు సమసిపోవు. జనాభా ప్రాతిపదికనే తీసుకుంటే అన్యాయం జరుగుతుందన్నది దక్షిణాది రాష్ట్రాల్లో ఉన్న సందేహం. అందుకు ఇతరత్రా ప్రాతిపదికలు తీసుకోబోతున్నామని తేటతెల్లం చేసినప్పుడే అందరికీ స్పష్టత వస్తుంది. దక్షిణాదితో పోలిస్తే ఉత్తరాది రాష్ట్రాలు చాలా అంశాల్లో సాపేక్షంగా వెనకబడి వున్నాయి. విద్య, వైద్యం, ఆర్థికం వగైరాల్లో దక్షిణాదిదే ముందంజ. ఇదంతా జనాభాను అదుపు చేయటం వల్లనే సాధ్యమైంది. 2011 జనాభా లెక్కల ప్రకారం బిహార్‌లో జనాభా పెరుగుదల రేటు 25 శాతంగావుంటే, కేరళలో అది 5 శాతం మాత్రమే. ఎన్నికలు జరిగినప్పుడల్లా బీజేపీ 'డబుల్ ఇంజన్ సర్కారు'ను తెరపైకి తెస్తుంది. ఆ సంగతెలా వున్నా దేశానికి 'గ్రోత్ ఇంజన్' దక్షిణాది అని చెప్పవచ్చు. అందుకే పునర్విభజనపై ఉన్న సందేహాలను పారదోలటం అవసరం.జనాభా లెక్కల సేకరణ జరిగి గణాంకాలు వెల్లడైనప్పుడల్లా ఆ ప్రాతిపదికన నియోజకవర్గాల హద్దులు, చట్టసభల్లో స్థానాల సంఖ్య మార్చాలని రాజ్యాంగం నిర్దేశిస్తోంది. దానికి అనుగుణంగా 1951, 1961, 1971 సంవత్సరాల జనాభా లెక్కల ప్రాతిపదికన లోక్‌సభ, రాజ్యసభ, రాష్ట్రాల అసెంబ్లీల్లోని స్థానాల సంఖ్య మారుతూ వచ్చింది. నియోజకవర్గాల పరిధులు కూడా మారాయి. కానీ 1976లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ దీనికి బ్రేక్ వేశారు. ఆత్యయిక స్థితి కొనసాగుతున్న వేళ 42వ రాజ్యాంగ సవరణ తీసుకొచ్చి 2001 వరకూ పునర్విభజన ప్రక్రియను స్తంభింపజేశారు. అధిక జనాభా ఉన్న రాష్ట్రాలు కుటుంబ నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసి జనాభా పెరుగుదలను అరికడితే ఏ రాష్ట్రమూ స్థానాల సంఖ్యను కోల్పోకుండా ఉంటుందని ఆమె ప్రభుత్వం భావించింది. కానీ ఎప్పటిలా దక్షిణాది రాష్ట్రాలే జనాభా అదుపులో ముందున్నాయి. 2001లో తప్పనిసరై పునర్విభజన ప్రక్రియ మొదలెట్టినా అది కేవలం నియోజకవర్గాల పరిధుల్లో మార్పులకే పరిమితమైంది. స్థానాల సంఖ్య యథాతథంగా ఉండిపోయింది. దక్షిణాది రాష్ట్రాల ఆందోళనను దృష్టిలో ఉంచుకునే ఆ పనిచేశారు.జనాభా పెరుగుదల రేటులో అసమతౌల్యం చాలా సమస్యలకు దారితీస్తోంది. ఉదాహరణకు ఉత్తరప్రదేశ్‌లో ఒక ఎంపీ సగటున 30 లక్షలమంది



జనాభాకు ప్రాతినిధ్యం వహించాల్సి వుంటుంది. అదే తమిళనాడులో అయితే దాదాపు 18 లక్షలమంది జనాభాకు ప్రతినిధిగా ఉంటారు. అంటే పునర్విభజన ప్రక్రియ ప్రాతిపదిక అన్ని అంశాల్లోనూ సమతుల్యతను సాధించాల్సి వుంటుంది. 1977 నాటి లోక్‌సభలో ప్రతి ఎంపీ సగటున 10.11 లక్షల జనాభాకు ప్రాతినిధ్యంవహించారు. అయితే అన్ని నియోజకవర్గాలూ ఈ చట్రంలో ఇమిడే అవకాశం ఉండదు గనుక కాస్త అటూ ఇటూగా నిర్ణయించారు. జనాభా లెక్కల సేకరణలో ఇప్పటికే మనం నాలుగేళ్లు వెనకబడి వున్నాం. కానీ కేంద్ర ఆరోగ్యమంత్రిత్వ శాఖ అంచనా ప్రకారం ప్రస్తుత జనాభా దాదాపు 143 కోట్లు. ఈ జనాభాకు 1977 నాటి ప్రాతిపదికన ఎంపీ స్థానాలు నిర్ణయించాల్సివస్తే వాటి సంఖ్య ఇంచుమించు 1,400కు చేరుతుంది. దీని ప్రకారం యూపీ స్థానాల సంఖ్య (ఉత్తరాఖండ్ కలుపు కొని) 85 నుంచి మూడురెట్లు పెరిగి 250కి చేరుతుంది. బిహార్‌కు (జార?ండ్ కలుపుకొని) ప్రస్తుతం ఉన్న 25 స్థానాలూ 82కు చేరుతాయి. తమిళనాడుకు దాదాపు రెట్టింపు సీట్లు పెరిగి 39 నుంచి 76 అవుతాయి. కేరళకు మాత్రం ప్రస్తుతం ఉన్న 20 కాస్తా 36 అవుతాయి. నియోజకవర్గానికి 20 లక్షల జనాభా ఉండాలనుకుంటే మొత్తం స్థానాలు 707 అవుతాయి. కానీ అలా జరిగితే తమిళనాడు స్థానాల సంఖ్య ఇప్పుడున్న మాదిరే ఉండిపోతుంది. కేరళ మాత్రం రెండు స్థానాలు కోల్పోతుంది. యూపీ మాత్రం 126కు చేరుతుంది. మన నూతన పార్లమెంటు భవనం 888 మంది ఎంపీలు ఆసీనులు కావటానికి వీలుగా నిర్మించారు. ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగకుండా, ఉన్న స్థానాలు కోల్పోకుండా పునర్విభజన ఉంటుందని అమిత్ షా చెప్పటం ఊరట కలిగిస్తుంది. కానీ జమ్మూ, కశ్మీర్‌లో జరిగిందేమిటి? అక్కడ అసెంబ్లీ స్థానాలు (లద్దాఖ్ మినహా) 83 నుంచి 90కి చేరు కున్నాయి. కొత్తగా పెరిగిన 7 స్థానాల్లో హిందువులు అధికంగా వున్న జమ్మూకు 6 వస్తే, ముస్లింల ప్రాబల్యంవున్న కశ్మీర్‌కు ఒక్కటి మాత్రమే పెరిగింది. అందుకే కేవలం అన్యాయం జరగదన్న హామీ మాత్రమే సరిపోదు. పునర్విభజన ప్రక్రియకు ఇక ఎంతో సమయం లేదు గనుక దానికి అనుసరించే ప్రాతిపదికలేమిటో తేటతెల్లం చేయటం అవసరం. అది చేయనంత కాలమూ సందేహాలు ఉత్పన్నమవుతూనే ఉంటాయి. వాటిని అబద్ధాలుగా కొట్టిపారేసినంత మాత్రాన సమసిపోవు.

# కర్ణాటక, మహారాష్ట్ర ఆర్టీసీ బస్సుల ఉదంతాలు: దీని అసలు నేపథ్యం ఏంటి?



బెంగళూర్ :బెల్గాం ప్రాంతంలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన బస్ కండక్టర్ మరాఠీ మాట్లాడలేదని ఓ యువకుడు తన ముగ్గురు మరాఠా మిత్రులను పిలిపించి ఆ కండక్టర్‌ను చితకబాదాడు. దీనికి ప్రతీకారంగా కొందరు కర్ణాటక యువకులు ఘటనతో సంబంధం లేని ఒక మరాఠా బస్సు డ్రైవర్ ముఖానికి నల్లరంగు పులిమారు.కర్ణాటక బస్ కండక్టర్ మాట్లాడేటప్పుడు మరాఠీ గురించి తప్పుగా మాట్లాడి ఉండవచ్చు, అందుకే దాడి జరిగిందని కాసేపు అనుకుందాం. మరి కర్ణాటక బస్సులో ప్రయాణం చేయని మిగతా ముగ్గురు యువకులకు ఈ సంఘటనతో ఏంటి సంబంధం? మహారాష్ట్ర బస్సు డ్రైవర్ ముఖాన నల్ల రంగు పులిమిన కర్ణాటక యువకులకు ఏంటి సంబంధం? అన్నిటికి మించి దాడికి గురైన మహారాష్ట్ర బస్సు డ్రైవర్ ఏ తప్పు చేసినట్టు? ఎందుకు శిక్షించబడ్డాడు? జరిగిన ఈ అంశాన్ని కేవలం కొందరు యువకుల అతి ప్రవర్తనగా కొట్టిపారేయలేం. ప్రస్తుతం దేశంలో రాజకీయ లబ్ధి కోసం నెలకొల్పబడుతున్న విద్వేష వాతావరణం ఈ ఘటనలకు కారణం కాదని కూడా చెప్పలేం. మనందరికీ భవిష్యత్తులో ఎప్పుడో ఒకసారి మహారాష్ట్ర బస్సు డ్రైవర్‌కు జరిగిన అనుభవం జరుగదని కూడా భావించలేం.భాష విషయంలో ఒక కండక్టర్తో జరిగిన చిన్నపాటి గొడవ ఇరు రాష్ట్రాలు తమ బస్సు సర్వీసులను తమ రాష్ట్ర సరిహద్దుల వరకే పరిమితం చేయాల్సిన దుస్థితికి దారితీసింది. ఇది ఇంతటితో ఆగతుందా? తమిళనాడులో భాషపై జరుగుతున్న వివాదం చిలికి చిలికి గాలివానగా మారుతుంది. కేంద్ర మంత్రికి, రాష్ట్ర ముఖ్యమంత్రికి మధ్య వాగ్వాదాలు జరగుతున్నాయి. సాంఘిక మాధ్యమాల్లో పరస్పర ఆరోపణలు నెటిజన్ల మధ్య అగ్గిరాజేస్తున్నాయి. ఇరు పక్షాల రాజకీయ నాయకులు దీనికి కావల్సినంత ఆజ్యం పోస్తూనే ఉన్నారు.ఈ క్రమంలోనే 'ఇండియా హేట్ ల్యాబ్' అనే సంస్థ భారత్‌లో రోజురోజుకు పెరుగుతున్న ద్వేషపు ప్రసంగాలపై ఒక రిపోర్టును విడుదల చేసింది. గత పదేళ్ళ కాలంలో ఎక్కువగా ద్వేషపూరిత ప్రసంగాల ధోరణి పెరిగిందని గణాంకాలతో సహా ప్రచురించింది. మహా కుంభమేళాలో పారిశుద్ధ్యం సరిగా లేదని ప్రస్తావిస్తే దైవ దూషణగా చిత్రీకరించే ఏకపక్ష మీడియా ఇలాంటి గంభీరమైన అంశాలను పాలకుల దృష్టికి తీసుకువెళ్లడంలో విఫలమవుతోంది. ఇది చాలా విచారకరం.చిలుకూరి బాలాజి టెంపుల్ ప్రధాన అర్చకుడిపై అదే మతానికి చెందిన మితిమీరిన మితవాద రామరాజ్యం వీర రాఘవరెడ్డి బృందం దాడి చేయడం కూడా ఇలాంటి అస్తిత్వవాదంలోకే వస్తుంది. వెజిటేరియన్ మాత్రమే తీసుకోవాలని కొందరు హుంకరిస్తున్న వేళ మేఘాలయ బీజేపీ అధ్యక్షుడు 'నేను బీఫ్ తింటాను, నా ఆహార అలవాట్లపై మాట్లాడే హక్కు మీకు లేదు' అంటూ సొంత పార్టీ నాయకులపై విరుచుకుపడ్డట్టు వార్తలు గుప్పుమంటున్నాయి. భాషా దురభిమానాలు, భక్తి దురభిమానాలు, ప్రాంతీయ దురభిమానాలు దేశంలో మరింత పెరిగిపోతాయని ఈ సంఘటనలన్నీ హెచ్చరిస్తున్నాయి. కేవలం మత విద్వేషంతో ప్రజలను ఏకీకృతం చేసి పబ్బం గడుపుకుందామని భావించిన వారికి మొదటిగా ఎదురైన సమస్య ఈ దేశంలో వేళ్లూనుకుని ఉన్న సామాజిక అంతరాలకు కారణమైన 'కుల వ్యవస్థ దాని పర్యవసానాలు' మెల్లి మెల్లిగా బయటపడుతుండడం. దీన్ని ఎదుర్కోవడానికి పురాణాలు ఇతిహాసాలలోని అనేక పేర్లను ప్రస్తావిస్తూ వ్యాసుడు, వాల్మీకీ, విదురుడు వంటి వారు ఫలానా ఫలానా కులమని కులాన్ని బట్టి కాదు గుణాన్ని బట్టి వర్ణ విభేదాలు ఉంటాయని నచ్చజెప్ప చూసే ప్రయత్నాలు సాంఘిక మాధ్యమాల్లో ఊపందుకున్నాయి. ఇదే సందర్భంలో మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, మేఘాలయంలలో చోటుచేసుకుంటున్న ఘటనలు బయటపడుతున్నాయి. ద్వేషం ద్వారా జరిగే ఐక్యత దేశీయులను కాకుండా ద్వేషీయులను మాత్రమే ఏకం చేయగలదు.మహాత్మా గాంధీ జాతిపిత ఎందుకయ్యాడంటే అస్తిత్వ వాదాన్ని బలపరచ లేదు కాబట్టి. సర్దార్ వల్లభాయి పటేల్ ఉక్కు మనిషి ఎందుకయ్యాడంటే అధికారం కోసం కాకుండా సిద్ధాంతానికి కట్టుబడాడు కాబట్టి. జవాహర్‌లాల్ నెహ్రూ దార్శనికుడు ఎందుకయ్యాడంటే రాజకీయాలకతీతంగా ప్రపంచ ఒత్తిళ్లకు తలొగ్గకుండా బహుళార్థ సాధక ప్రాజెక్ట్‌లకు కంకణబద్ధుడైనందువల్ల.భారతదేశం స్వాతంత్ర్యం పొందిన తర్వాత 550కిపైగా సంస్థానాలు, మొగలు సామ్రాజ్యం, బ్రిటిష్ సామ్రాజ్యంతో పాటు మరాఠా, పండిట్ల రాజ్యాలు భారత్‌లో విలీనమైయ్యాయి. స్వాతంత్రానికి ముందు అనేక రాజ్యాలలో ప్రజలు నానా బాధలు పడ్డారు. బానిస బతుకులను అనుభవించారు. నిర్ధాక్షిణ్యంగా దోపిడీకి గురయ్యారు. అంటరానితనం-అస్పృశ్యత రాజ్యమేలింది. ఆడదంటే ఒక ఆట వస్తువు అనే విషసంస్కృతి పశువులా చెలరేగింది. ఇలాంటి అనేక ఈతిబాధలను భరిస్తూనే ఇప్పుడున్న జనాభాలో కేవలం ఐదో వంతు ఉన్న నాటి ప్రజానీకం ఏ మాత్రం కమ్యూనికేషన్ వ్యవస్థ సరిగ్గా లేని స్థితిలో గాంధీ నెహ్రూలకు స్వాతంత్ర్య సంగ్రామంలో ఎక్కడలేని తోడ్పాటునందించారు.స్వాతంత్ర్యం తర్వాత ఇలాంటి అమానుషమైన పరిస్థితులను ఆపడానికి జరిగిన పెద్ద కృషి ఏమీ లేదు. అయినప్పటికీ భారతీయులంతా ఒక్కటే అనే బాధ్యతోద్వేగం ప్రతి ఒక్కరిలోనూ పెరిగింది, కలిసి మెలిసి కొనసాగింపు ప్రారంభించారు. అందుకేనేమో 1947 నుండి భారత్ అర శతాబ్దానికి పైగానే ఏ రకమైన అస్తిత్వ పోరాటాలకు ఎవరూ ఆజ్యం పోయలేదు. మరి ప్రస్తుత పరిస్థితులు ఎలా ఉన్నాయి? ఇతిహాసాలను, చారిత్రక ఇతివృత్తాలను, తమదైన కోణంలో ప్రస్తుతించి, అభాండాలు- అకృత్యాలు ఎవరెవరికో అంటగట్టి విద్వేషాలు నూరిపోస్తున్నారు. స్వాతంత్ర్య సంగ్రామంతో ఏమాత్రం సంబంధం లేని సమూహాలు తమ రాజకీయ లబ్ధి కోసం మతపరమైన ఏకీకరణకు పదును పెట్టి దేశ ప్రజల్లో ఒకరంటే మరొకరికి ద్వేషం కలిగేలా సఫలీకృతులవుతున్నారు.కొన్ని రోజుల క్రితం, పాత హిందీ సినిమా 'అమర్ అక్బర్ అంటోనీ' పోస్టర్‌ను ఉటంకిస్తూ తెలుగు కవి సిద్ధార్థ సుభాష్‌చంద్రబోస్ తన ఫేస్‌బుక్ వాల్‌పై ఇలా రాశారు. 'సరిగ్గా 25, 30 ఏళ్ల క్రితం ఇరు మతాల పట్ల ప్రజలకున్న పరస్పర గౌరవాలు, వివిధ మతాలవారి పండుగల సందర్భంగా ఒకరికొకరు సహకరించుకునే తీరు ఒకరికి జబ్బు చేస్తే మరొకరు తమ ఇష్ట దైవాన్ని ప్రార్థించి విభూతి పులిమినా, నెమలి పించాన్ని తలపై నిమిరినా, ఛాతి నుంచి నోసటిదాక చేతులాడిస్తూ ప్రార్థన చేసినా అందరూ అంగీకరించే వారు. దైవత్వం ఏదో ఒక రూపంలో తమకి నష్టం జరగకుండా చూస్తే చాలు అనుకునేవారు. ఇప్పుడా పరిస్థితులు లేవు.' అని ప్రస్తావిస్తారు.మరి ఇప్పుడు దేశంలో ఎలాంటి పరిస్థితులున్నాయి? ఒకదాని తర్వాత ఒకటి వరుసగా జరుగుతున్న పరిణామాలు భయపెడుతున్నాయి. సాధారణంగా డ్రైవర్లలో ముస్లింలు ఎక్కువగా ఉంటారు. ప్రయాణికులను తిరుమలకు తీసుకువెళ్ళే కార్లపై ఉర్దూలో రాసి ఉంటే వెంటనే ఆ స్టిక్కర్లను చింపివేయడమో లేదా అద్దాలను పగలగొట్టే సంఘటనలు జరుగుతున్నాయని వింటున్నాము. ఇది ఏ రకమైన ఉద్ధరణ? వెర్రితలలు వేస్తున్న ఇలాంటి చౌకబారు ఘటనల, కొందరి సంకుచిత ఆలోచనల అస్థిత్వవాదపు ఉగ్రరూపాన్ని అడ్డుకోకపోతే మహారాష్ట్ర బస్ డ్రైవర్‌కు జరిగిన అన్యాయం అందరికీ తప్పదేమో..!

## కేబీఆర్ పార్కు విస్తరణ పనులపై హైకోర్టులో విచారణ

హైదరాబాద్,నగరంలోని కేబీఆర్ పార్కురహదారి విస్తరణకు సంబంధించి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. రహదారి విస్తరణ వల్ల 306 ఇళ్లు, వ్యాపార సముదాయాలు కోల్పోతున్నామని రోడ్డు నెం 92లో ఉన్న కాలనీవాసుల పిటిషన్ వేశారు. 100 నుంచి 120 ఫీట్ల వరకు విస్తరణ చేపడుతున్నారనట్లు పిటిషనర్లు తెలిపారు. విరంచి ఆస్పత్రి చౌరస్తా నుంచి కేబీఆర్ పార్కు మీదుగా జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు విస్తరణ చేయాలని నిర్ణయించారని, రహదారి విస్తరణపై సీఎస్, జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చామని కాలనీవాసులు పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇళ్లకు, వ్యాపార సముదాయాలకు మార్కింగ్ వేస్తూ భయాందోళనకు గురిచేస్తున్నారని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. రహదారికి మరోవైపు ప్రభుత్వ భూమియే ఉందన్నారు. అటువైపే పూర్తిగా విస్తరణ చేపడితే నష్టం తగ్గుతుందని పిటిషనర్లు కోర్టుకు తెలిపారు. దీనిపై విచారించిన హైకోర్టు.. మరోసారి జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం ఇవ్వాలని పిటిషనర్లను ఆదేశించింది. పిటిషనర్ల వినతిపత్రాన్ని నిబంధనల ప్రకారం పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌కు న్యాయస్థానం ఆదేశిస్తూ.. పిటిషన్లపై విచారణ ముగించింది.

## ఆశావహుల క్యూ..

హైదరాబాద్,: తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలు ఐదు ఖాళీ అవుతున్నాయి. వాటి ఎన్నికలకు ఎన్నికల షెడ్యూల్ కూడా విడుదలైంది. ఖచ్చితంగా ఆ అయిదు స్థానాల్లో నాలుగు కాంగ్రెస్ మద్దతు దారులకు దక్కనున్నాయి. ఆ నాలుగు స్థానాలు కోసం ఏకంగా 40 మంది వరకు ఆశావహులు క్యూ కడుతున్నారు. సామాజిక సమీకరణ వారీగా ఆ పోస్టుల కోసం కాంగ్రెస్‌లో విపరీతమైన పోటీ నెలకొంది. ఇప్పటి వరకు అవకాశం రాని నేతలు, ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన నేతలు, సీనియర్లు ముమ్మర ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఆ క్రమంలో అదృష్టం ఎవరిని వరిస్తుందనేది ఆసక్తి రేపుతోంది.

### ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్

తెలంగాణలో అయిదు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. మార్చి 3 న నోటిఫికేషన్ వెలువడనుండగా, మార్చి 20 న ఎన్నికలు, అదే రోజు ఫలితాలు వెలువడతాయి. అసెంబ్లీలో సంఖ్యాబలాలను బట్టి వాటి ఒక స్థానం బీఆర్ఎస్ ఖాయమైనా.. మిగిలిన నాలుగు కాంగ్రెస్ మద్దతుదారులకు దక్కనున్నాయి. దాంతో పలువురు ఆశావహులు ఎవరి స్థాయిల్లో వారు లాబీయింగ్ చేసుకుంటున్నారు.. బీసీ కులగణనను హైలెట్ చేసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఎమ్మెల్యేల నియామకంలో సామాజిక సమీకరణలకు ప్రాధాన్యత ఇవ్వడం ఖాయంగా కనిపిస్తుంది.

### సొంత బలంతో 3 స్థానాలు గెలుచుకోనున్న కాంగ్రెస్

అసెంబ్లీలో కాంగ్రెస్ సంఖ్య బలం ఆధారంగా.. ఎమ్మెల్యే కోటా కింద ఉన్న ఐదు ఎమ్మెల్సీ స్థానాల్లో కాంగ్రెస్ మూడు స్థానాలను సులభంగా గెలుచుకోగలదు. మరో అదనపు సీటు గెలవాలంటే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోని చేరిన 10 మంది ఎమ్మెల్యేల మద్దతు కీలకం కానుంది. అయితే ఎంఐఎం, సీపీఐలు ఒక సీటును ఆశిస్తున్నాయి. కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా సీపీఐ ఒక్క సీటు కాంగ్రెస్‌ను అడుగుతుంది. దీనిపై కాంగ్రెస్ ఎలా స్పందిస్తుందనేది చర్చనీయాంశంగా మారింది. మరోవైపు ప్రస్తుతం ఖాళీ అవుతున్న ఒక్క స్థానంలో తమ అభ్యర్థికి సహకరించాలని ఎంఐఎం పట్టుబడితే%ా% అవగాహనలో భాగంగా కాంగ్రెస్ మద్దతు ఇస్తుందా? అనేది కూడా చూడాల్సి ఉంది.

### సీపీఐతో కలిపి కాంగ్రెస్ కు అసెంబ్లీలో 66 మంది ఎమ్మెల్యేలు

ఎమ్మెల్సీలుగా ఉన్న మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, షేరి సుభాష్ రెడ్డి, ఎగ్గే మల్లేశం, మీర్జా రియాజుల్ హాసన్‌ల పదవీకాలం ఈ ఏడాది మార్చి 29తో ముగియనుంది. మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, షేరి సుభాష్ రెడ్డి, ఎగ్గే మల్లేశంలు బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీలుగా గెలుపొందగా.. ఎంఐఎం నేత మీర్జా రియాజుల్ హాసన్ మాత్రం బీఆర్ఎస్ మద్దతుతో ఎంఐఎం సభ్యుడిగా శాసనమండలికి ఎన్నికయ్యారు. అసెంబ్లీలో కాంగ్రెస్‌కు సీపీఐ సభ్యుడితో కలిపి అధికారికంగా 66 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉంది. పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలను మినహాయిస్తే బీఆర్ఎస్‌కు 28 మంది ఎమ్మెల్యేలున్నారు. ఒక్క ఎమ్మెల్సీ సీటు గెలవడానికి 20 మంది ఎమ్మెల్యేల మొదటి ప్రాధాన్యత ఓట్లు అవసరం.

### ఈ నెల28న గాంధీ భవన్2లో విస్తృత స్థాయి సమావేశం

కాంగ్రెస్ ఈ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికకు సంబంధించి ఈ నెల 28న గాంధీ భవన్ లో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనుంది. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల కొత్త ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లు ఈ కీలక సమావేశంలో ఏ నిర్ణయం తీసుకొంటారో అని నేతల్లో ఉత్కంఠ నెలకొంది. పార్టీ మారిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంఐఎం మద్దతుతో ఖాళీ కానున్న ఐదు స్థానాలలో నాలుగింటిని కచ్చితంగా కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ పావులు కదుపుతోంది .. అయితే ఎవరికి ఇవ్వాలని కాంగ్రెస్ తర్జన భర్జన పడుతుంది.

### రేసులో ఎన్నికల్లో ఓడిపోయిన కాంగ్రెస్ నేతలు

మొత్తమ్మీద నాలుగు ఎమ్మెల్సీ స్థానాలకు తీవ్ర పోటీ నెలకొందని చెప్పొచ్చు, ఎందుకంటే కాంగ్రెస్ అధికారంలో కి రావడానికి కష్టపడ్డవారు కావొచ్చు, కార్పొరేషన్ పదవులలో అవకాశం రాని వారు, పార్టీ పదవులలో చోటు దక్కని వారు ఇలా చాలా మంది ఆశలు పెట్టుకున్నారు. అన్ని జిల్లాలలోని సీనియర్ నేతలు, పాత, కొత్త భేదం లేకుండా అందరూ సీరియస్ గా ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేసి ఓడి పోయిన వారికి ఏడాది వరకు ఎలాంటి అవకాశాలు లేవని పార్టీ కండిషన్ పెట్టింది. కానీ ఇప్పటికే ఏడాది పూర్తి అయింది కాబట్టి వారు కూడా రేసులోకి వస్తున్నారు.

### అవగాహనలో భాగంగా ఎంఐఎంకి ఒక స్థానం కేటాయిస్తారా?

సామాజిక వర్గాల వారిగా నాలుగు స్థానాలకు 40మంది వరకు పోటీ పడుతున్నారని తెలుస్తుంది. అయితే బీసీ కులగణన జరగడం, తెలంగాణ లో 50 శాతం పైగా బీసీలు ఉన్న నేపథ్యంలో, బీసీలకే ఎక్కువ అవకాశం ఇవ్వాలని ఆ సామాజిక వర్గ నేతలు ఒత్తిడి తెస్తున్నారు. ఎస్సీ లకే అవకాశం ఇవ్వాలని ఆ సామాజిక నేతలు పట్టు పడుతున్నారు. ఎస్టీ నేతలకు ఇప్పటివరకు ప్రాధాన్యత దక్కలేదని, ఖచ్చితంగా చాన్స్ ఇవ్వాలని ఆ వర్గం నేతలు డిమాండ్ చేస్తున్నారు. మరో వైపు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేతలు కూడా హై కామాండ్ పై ప్రెజర్ తెస్తుండటంతో హై కమాండ్ ఏం చేయాలో పాలుపోని స్థితిలో ఉందంట.

### పోటీ పడుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు

ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, షబ్బీర్ అలీ, హర్కర వేణుగోపాల్ వంటి సీనియర్లు కూడా ఎమ్మెల్సీ పదవులు రేసులోకి రావడం ఉత్కంఠ రేపుతోంది. ఈ ముగ్గురు సీఎంకు అత్యంత సన్నిహితులు. హైకమాండ్ దగ్గర తమకున్న పలుకుబడితో వారు లాబీయింగ్ చేసుకుంటున్నారంట. ఇక మాజీ ఎమ్మెల్యేలు జగ్గారెడ్డి , జీవన్ రెడ్డి లాంటి వారు కూడా ట్రై చేస్తున్నారంట. మొత్తానికి 4 ఎమ్మెల్సీ పదవుల కోసం 40 మంది పోటీ పడుతుండటంతో.. ఆ లక్కీ ఫోర్ ఎవరనేది చూడాలి.

# పత్తా లేని డాక్టర్ అప్పలరాజు..



అమరావతి, మొదటి సారి ఎమ్మెల్యేగా గెలిచారు. డాక్టర్‌గా పొలిటీషియన్ అవతారమెత్తిన అతను తన నోటి దూకుడుతో వైసీపీ అధ్యక్షుడు జగన్ గుడ్‌లుక్స్‌లో పడి అయిదేళ్లు కేబినెట్ బెర్త్ కూడా వెలగబెట్టారు. అప్పట్లో నియోజకవర్గంలో ఆయన మాటే వేదవాక్కులా నడిచింది. ఆయన మాటకి తిరుగులేకుండా ఏం చేసిన చెల్లిపోయేది. వైసీపీ మార్క్ కక్షపూరిత రాజకీయాలతో ఇష్టానుసాం చలరేగిపోయారు .. ఓడలు బళ్లు.. బళ్లు ఓడలు అవుతాయి అంటారు చూడండి.. ఇప్పుడు ఆ పరిస్థితే సదరు మాజీ మంత్రికి ఎదురైందంట. నియోజకవర్గంలో నియంతలా వ్యవహరించిన ఆయన ఇప్పుడు కనిపించకుండా పోయారు.. అసలాయన అంత సైలెంట్‌గా సైడ్ అవ్వడానికి కారణం ఏంటి?మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు.. సిద్ధాంత పరమైన విమర్శల కంటే.. వ్యక్తిగత విమర్శలతోనే ఎక్కువ ఫేమస్ అయ్యారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి టీడీపీ అభ్యర్థి గౌతు శిరీషపై గెలిచి తొలిసారి ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగు పెట్టారు. ఫస్ట్ టైం గెలిచినప్పటికీ అప్పలరాజుకి సీఎం జగన్ ఐదేళ్లపాటు మంత్రిగా చేసే ఛాన్స్ ఇచ్చారు. కానీ గెలవడమే మొదలు అప్పలరాజు పలాసలో ప్రతీకార రాజకీయాలకు పాల్పడి, అక్రమాలు, అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలున్నాయి. అందుకే రీసెంట్ ఎన్నికల్లో 40,350 ఓట్ల మెజారిటీతో అప్పలరాజుపై.. గౌతు శిరీష అలవోకగా గెలుపొందారు.పలాస నగరం నడిబొడ్డున ఉన్న స్వాతంత్ర సమరయోధులు సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహం తొలగించే ప్రయత్నం చేయడం అప్పట్లో వివాదాస్పదంగా మారింది. ప్రభుత్వ స్థలం ఆక్రమించి గౌతు లచ్చన్న విగ్రహం ఏర్పాటు చేశారనే నెపంతో.. అధికారుల సాయంతో విగ్రహాన్ని తొలగించేగించేందుకు ప్రయత్నించారనే వాదన కూడా ఉంది. అయితే కేవలం గౌతు శిరీషాపై అక్కసు తోనే.. సీదిరి ఆ పని చేయించారనే విమర్శలు వెల్లువెత్తాయి. అలానే కోడేలు చెరువు ప్రాంతాన్ని టీడీపీ నాయకులు ఆక్రమించి.. ఇళ్లనిర్మాణాలు చేశారంటూ నిర్మాణాలని తొలగించడంతో అప్పట్లో పెద్ద రచ్చే జరిగింది. నిర్మాణాల కూల్చివేతని నిరసిస్తూ.. లోకేష్ పలాస వస్తుండగా ఆయనను అరెస్ట్ చేయడం కూడా విమర్శలకు దారి తీసింది.ఇదంతా ఒక ఎత్తయితే%8% అప్పలరాజు పలాసలో ఆక్రమణలకు పాల్పడుతున్నారని అప్పట్లో గౌతు శిరీష ఆరోపణలు చేశారు. మంత్రి అయిన తరువాత భూముల ఆక్రమణలతో పాటు.. సూది కొండ, నెమలి కొండలను కూడా నిబంధనలకి విరుద్ధంగా తవ్వేశారని శిరీషా విమర్శలు గుప్పిస్తునే వచ్చారు. పలాస నియోజకవర్గంలో మంత్రిగా అప్పలరాజు చేసిన అభివృద్ధి ఏమిలేదని ఐదేళ్ల పాటు ఎద్దేవా చేసేవారు. దీంతో పలాసలో సీదిరి అప్పలరాజు.. గౌతు శిరీషాల మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనే వాతావరణం ఉండేదని టాక్ నడిచేది. తనపై చేస్తున్న ఆరోపణలను తట్టుకోలేక అప్పలరాజు శిరీషాని వ్యక్తిగతంగా ఇబ్బంది పెట్టేందుకు%8% ఆమె కొత్త ఇంటి నిర్మాణం సజావుగా జరగకుండా అడ్డంకులు సృష్టించారని టీడీపీ నేతలు ఫైర్ అవుతూనే ఉన్నారు. అంతటితో ఆగకుండా గౌతు శిరీషా పై సోషల్ మీడియాలో సైతం అసభ్యకరమైన పోస్టులు పెట్టించారని ఆరోపణలు ఉన్నాయి.వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు సీదిరి అప్పలరాజు తరచుగా మీడియా ముందుకు వచ్చే వారు. వైసీపీ పాలనపై పాజిటివ్‌గా స్పందించేవారు. అదే సమయంలో టీడీపీ, జనసేనలపై నిప్పులు చెరిగేవారు. అలాంటాయన ఇప్పుడు కొన్నాళ్లుగా ఆయన కనిపించడం లేదు. పలాస నియోజకవర్గంలోనూ ఆయన పేరు వినిపించడం లేదు. ఆయన కూడా కనిపించడం లేదు. ఎక్కడున్నారో కూడా చెప్పకుండా.. కార్యకర్తలకు కూడా అందుబాటులో లేకుండా వ్యవహరిస్తున్నారు.నిజానికి ఎన్నికలకు ముందు, తర్వాత కూడా సీదిరి రాజకీయాలు జోరుగా సాగాయి. వరుస విజయాలతో ఆయన దూసుకుపోవాలని అనుకున్నా.. గత ఎన్నికల్లో సొంత సామాజిక వర్గం ఆయనకు దూరమైంది. ఆ తర్వాత ఒకటి రెండు సార్లు మీడియా ముందుకు వచ్చినా.. తర్వాత సైలెంట్ అయ్యారు. దీనికి కారణం వేరే ఉందని అంటున్నారు పరిశీలకులు. అప్పలరాజు మంత్రిగా ఉన్న చేసిన సమయంలో పాల్పడిన అక్రమాలపై ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టి పెట్టారంట. ఎక్కడ ఎంత మేరకు నిధులు దారిమళ్లాయన్న విషయంపై ఆమె కూపీ లాగుతున్నారంట. ఈ విషయాలు ఇంకా బయటకు పొక్కక ముందే.. మాజీ మంత్రి తనంతట తానే సైలెంట్ కావడం అనుమానాలకు తావిస్తోంది. ఎక్కడా ఆయన ప్రభుత్వంపై విమర్శలు చేయడం కానీ.. నియోజకవర్గంలో ప్రెస్ మీట్లు పెట్టడం కానీ చేయడం లేదు. దీని వెనుక ఆయన భయపడుతున్నారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు.మరోవైపు.. వైసీపీలోనూ.. సీదిరిని వ్యతిరేకిస్తున్న వర్గం.. ఈ విచారణ ఎంత త్వరగా జరిగితే అంత బాగుంటుందని కోరుకుంటుండడం గమనార్హం. అధికారంలో ఉన్నప్పుడు.. తమను పట్టించుకోలేదన్న ఆగ్రహంతో సీదిరిని పలాస వైసీపీ ఇన్చార్జ్‌గా తప్పించాలని వైసీపీ వర్గాలే డిమాండ్ చేస్తున్నాయి .. ఇలాంటి పరిస్థితుల్లోటీడీపీ ఎమ్మెల్యే గౌతు శిరీషకూడా .. సమయం చూసుకుని సిదిరిపై చర్యలకు పావులు కదుపుతుండటంతో ఆ డాక్టర్ కం పొలిటీషియన్ సైలెంట్ అయిపోయారంట. సదరు మాజీ మంత్రివర్యులు వైసీపీ నాయకులకు కూడా అందుబాటులో లేకుండా వ్యవహరిస్తున్నారట. మరి మున్ముందు ఆయన పరిస్థితి ఎలా ఉంటుందో చూడాలి.

# కరెంటుకు కటకటే.. వేసవికి ముందే విద్యుత్తు సంక్షోభం?

హైదరాబాద్, రాష్ట్రంలో తీవ్ర విద్యుత్తు సంక్షోభం పొంచి ఉందని నిపుణులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. ఫిబ్రవరిలోనే గరిష్ఠ విద్యుత్ డిమాండ్ నమోదయిన నేపథ్యంలో రానున్న కాలంలో గడ్డుపరిస్థితులు తప్పేలాలేవని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం, విద్యుత్ సంస్థలు సన్నద్ధంగా లేకపోవడమే ఇందుకు కారణమని చెప్తున్నారు. రాష్ట్రంలో విద్యుత్తు అవసరాలు 308–310 మిలియన్ యూనిట్లు కాగా దీంట్లో ఇతర రాష్ట్రాల నుంచి కొంటున్నది 159 మిలియన్ యూనిట్లు. అంటే సగానికి పైగా విద్యుత్తును కొనాల్సి వస్తున్నది. వేసవి వచ్చే వరకు ప్రభుత్వం, విద్యుత్తు సంస్థలు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కోతలు తప్పేలాలేవని నిపుణులు చెప్తున్నారు. కాంగ్రెస్ గత పాలనలో పేలిపోయే సబ్‌స్టేషన్లు, కాలిపోయే ట్రాన్స్‌ఫార్మర్ల పరిస్థితి పునరావృతం కానుందా? అని రైతు సంఘాల నేతలు వాపోతున్నారు.

ఇప్పుడే ఇలా ఉంటే..!

రాష్ట్రంలో ఫిబ్రవరిలోనే గరిష్ఠ విద్యుత్తు డిమాండ్ 16,506 మోగావాట్లుగా నమోదైంది. మొత్తం విద్యుత్తు డిమాండ్‌లో వ్యవసాయం రంగం నుంచి 34 శాతం, గృహ, వాణిజ్యరంగాల నుంచి 66 శాతం డిమాండ్ ఉంటుంది. ఎండకాలం మనకు విద్యుత్తు ఇస్తున్న ఇతర రాష్ట్రాల్లోనూ డిమాండ్ పెరుగుతుంది. ఆయా రాష్ట్రాలు విద్యుత్తు ఇవ్వకపోతే పరిస్థితి ఏంటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. మన దగ్గర ఉత్పత్తిపై దృష్టి పెట్టకపోవడంతో రాష్ట్రం అంధకారమయ్యే దుస్థితి నెలకొన్నదని నిపుణులు పేర్కొంటున్నారు.

తట్టుకోవడం కష్టమే

శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలు ఖాళీ అయ్యాయి. భూగర్భజలాలు అడుగంటాయి. చెరువుల్లోనూ నీటిలభ్యత తగ్గింది. కాలువల ద్వారా పారకం తగ్గింది. యాసంగి పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. పంటలు కాపాడుకునేందుకు రైతులు బోర్లు, బావుల మీద ఆధారపడుతున్నారు. దీంతో పంపుసెట్ల వినియోగం పెరిగింది. గృహ వినియోగానికి సంబంధించి ఏసీలు, ఫ్యాన్లు, కూలర్ల వాడకం పెరుగుతున్నది. పెరిగిన విద్యుత్తు సరఫరా డిమాండ్‌ను తట్టుకోవాలంటే వ్యవస్థలు పటిష్టంగా ఉండాలి. కానీ అందుకు కూడా విద్యుత్తు సంస్థలు సన్నద్ధంగా లేవని సమ్మర్ యాక్షన్ ప్లాన్ పురోగతి స్పష్టంచేస్తున్నదని నిపుణులు చెప్తున్నారు.

సమీపిస్తున్న బ్యాంకింగ్ గడువు

ఒక రాష్ట్రం నుంచి విద్యుత్తును మరో రాష్ట్రం వాడుకుని, మళ్లీ అవసరమైనప్పుడు తీసుకునే పవర్ స్వాప్ అగ్రిమెంట్ (బ్యాంకింగ్) విధానం అమల్లో ఉంది. ఇందులోభాగంగా ఉత్తరప్రదేశ్ నుంచి 1000–2,500 మోగావాట్ల సామర్థ్యం గల పవర్ బ్యాంకింగ్ గడువు ఈ నెల 28తో ముగియనుంది. 1500–3000 మెగావాట్ల సామర్థ్యం గల పవర్ బ్యాంకింగ్ గడువు మార్చి 31తో ముగియనుంది. మధ్యప్రదేశ్ నుంచి 150 మెగావాట్ల విద్యుత్తు బదిలీ గడువు ఏప్రిల్ 15తో ముగియనుంది. 500 మెగావాట్లకు సంబంధించిన గడువు ఏప్రిల్ 30తో



పూర్తవుతుంది.

నత్తనడకన సన్నద్ధత

వేసవి విద్యుత్తు డిమాండ్‌ను అధిగమించేందుకు సమ్మర్ యాక్షన్‌ప్లాన్ పేరుతో డిస్కంలు చేపట్టిన పనులేమీ కొలిక్కి రాలేదు. ప్రణాళికలో భాగంగా కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల బిగింపు, 33 కేవీ, 11కేవీ ఫీడర్లను మార్చడం వంటి పనులు చేయాలని నిర్ణయించారు. కానీ ఏ పనులు కూడా పూర్తికాలేదు. ఈ నేపథ్యంలో డిమాండ్ మరింత పెరిగితే విద్యుత్తు వ్యవస్థలు, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లు తట్టుకుంటాయా? అని అధికారులు కూడా అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు.

గరిష్ఠ విద్యుత్తు డిమాండ్‌పై పొంతనలేని లెక్కలు

హైదరాబాద్,రాష్ట్రంలో విద్యుత్తు వినియోగంపై ప్రభుత్వం చెప్తున్న లెక్కలకు, ట్రాన్స్‌కో చెప్తున్న లెక్కలకు పొంతన కుదరడం లేదు. ఫిబ్రవరి 26న గరిష్ఠ విద్యుత్తు డిమాండ్ 16,506 మెగావాట్లకు చేరినట్టు ట్రాన్స్‌కో వెబ్‌సైట్ స్పష్టం చేసింది. కానీ, 16,601 మెగావాట్లుగా ఉన్నట్టు ఇంధనశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా శుక్రవారం ప్రకటించారు. దీంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

గరిష్ఠం 7–8 నిమిషాలే..

సహజంగా ఉదయం 8 నుంచి 8:30 గంటల మధ్యలో విద్యుత్తు వినియోగం అధికంగా ఉంటుంది. ఆ సమయంలో గరిష్ఠ డిమాండ్ 16 వేల మెగావాట్లకు చేరి 7–8 నిమిషాల కొనసాగుతుంది. శుక్రవారం ఉదయం 7:52 గంటల సమయంలో గరిష్ఠ డిమాండ్ 16,387 మెగావాట్లకు చేరి, తర్వాత తగ్గుముఖం పట్టింది. రాత్రి 6:45కు 9,709 మెగావాట్లకు పడిపోయింది.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

అత్యవసర సర్వీసులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్టు అధికారులు తెలిపారు. సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో సందీప్‌కుమార్ సుల్తానియా మాట్లాడుతూ.. మార్చిలో గరిష్ఠ డిమాండ్ 17,500 మెగావాట్లకు చేరొచ్చని చెప్పారు.

# కిచెన్ వ్యర్థాలతో బయోగ్యాస్

హైదరాబాద్,సంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగంపై జేఎన్‌టీయూ మరింత దృష్టి సారించింది. ఇప్పటికే సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ కాలేజీలో సోలార్ ఎనర్జీ ప్లాంట్‌ను ఏర్పాటుతో విద్యుత్ చార్జీలు గణనీయంగా ఆదా అవుతుండగా, త్వరలో హైదరాబాద్ క్యాంపస్‌లోని హాస్టళ్ల నుంచి వచ్చే కిచెన్ వ్యర్థాలతో బయోగ్యాస్‌ని ఉత్పత్తి చేసేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ప్రస్తుతం వర్సిటీ ప్రాంగణంలో గౌతమి, కిన్నెర, మంజీరా, కమలానెహ్రూ వసతి గృహాలు ఉండగా, ఆయా హాస్టళ్ల నుంచి రోజుకు కనిష్టంగా 750నుంచి గరిష్టంగా 900క్వింటాళ్ల కిచెన్ వ్యర్థాలను మున్సిపాలిటీ డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు. అయితే, ఆ వ్యర్థాలతో బయోగ్యాస్ ఉత్పత్తి చేస్తే గ్యాస్ ఖర్చులు ఆదా అవడమే కాకుండా యూనివర్సిటీకి గ్రీన్ ఎనర్జీ క్రెడిట్స్ కూడా లభిస్తాయని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కాలేజీకి న్యాక్ అక్రిడిటేషన్, ఎన్‌బీఏ అక్రిడిటేషన్‌ల కోసం సమర్పించే దరఖాస్తులో గ్రీన్ ఎనర్జీ క్రెడిట్స్‌కు ప్రాధాన్యం ఉండడంతో ఆయా అక్రిడిటేషన్లు పొందేందుకు ఈ అంశం దోహదపడనుంది. గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించడంలో భాగంగా బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు అయ్యే ఖర్చులో 50శాతం సబ్సిడీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్నాయి. అయితే, ప్రస్తుతం భారీ ప్లాంట్లకు మాత్రమే అందిస్తున్న ఈ సబ్సిడీని చిన్న, మధ్యతరహా ప్లాంట్లకు కూడా అందించాలనే ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. కిచెన్ వ్యర్థాలు, ఆహార వ్యర్థాలతో బయోగ్యాసను ఉత్పత్తి చేయడంతో పాటు, చివరగా వచ్చే వ్యర్థాలను కూడా కంపోస్టు ఎరువుగా మార్చితే మరింత ఆదాయం సమకూరుతుందని బయోగ్యాస్ ప్రొడక్షన్ అంశంపై పరిశోధన చేసిన జేఎన్‌టీయూ పూర్వ విద్యార్థి శ్రీనివాస్ తెలిపారు. దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని వర్సిటీ ప్రాంగణంలో వెయ్యి కేజీల సామర్థ్యం కలిగిన



ఎనరోబిక్ డైజేషన్ (బయోగ్యాస్ ప్లాంట్)ను ఏర్పాటు చేస్తే జేఎన్‌టీయూను జీరో వేస్టేజ్ క్యాంప్‌సగా మార్చవచ్చని పేర్కొన్నారు. యూనివర్సిటీ హాస్టళ్లలో కిచెన్ వ్యర్థాల నుంచి బయోగ్యాస్ ఉత్పత్తి చేస్తే ఏటా రూ.4.32లక్షలు ఆదా అవుతుందని ఉన్నతాధికారులు ఒక అంచనాకు వచ్చారు. వెయ్యి కేజీల వ్యర్థాల సామర్థ్యం కలిగిన ప్లాంట్ ద్వారా రోజుకు 52కేజీల గ్యాస్‌ను ఉత్పత్తి చేసేందుకు వీలవుతుంది. సగటున రోజుకు 3 ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల వాడకానికి అయ్యే ఖర్చును రూ.3 వేల దాకా (సిలెండర్‌కు రూ.1,000చొప్పున) తగ్గించవచ్చు. నెలకు రూ.36వేలు ఆదా అవుతుండగా, ఏడాదికి రూ.4.32లక్షలు, ఐదేళ్లకు సుమారుగా రూ.22లక్షలు వ్యయాన్ని తగ్గించవచ్చని అంచనా వేస్తున్నారు. అంతేకాకుండా వర్సిటీలో బయోగ్యాస్ ప్లాంట్(ఎనరోబిక్ డైజేషన్)ను ఏర్పాటు చేస్తే పరిశోధక విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆచార్యులు భావిస్తున్నారు.

# బిజెపి జాతీయ అధ్యక్షుడి ఎంపిక కసరత్తు



న్యూఢిల్లీ,భారతీయ జనతా పార్టీకి త్వరలో కొత్త అధ్యక్షుడు రాబోతున్నాడన్న వార్తల నేపథ్యంలో..తదుపరి అధ్యక్షపీఠం ఎవరిని వరిస్తుందో అన్న చర్చ సాగుతోంది. పార్టీకి విధేయకంగా ఉండడంతో పాటు సంఘ్, పరిషత్ అనుభవం ఉంటే అదనపు ఆకర్శణ కాగలదు. మరోవైపు పార్టీని నడిపించే సత్తా కూడా ముఖ్యం. వివిధ రాష్ట్రాలతో పరిచయం, అందరినీ కలుపుకుపోవడం వంటివికూడా మరీ ముఖ్యం. దీనికితోడు ఛరిష్మా కూడా అసవరం ఉంటుంది. ప్రస్తుతం పార్టీలో సంస్థాగత ఎన్నికలు జరుగుతుండగా త్వరలోనే జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకునే పక్రియ చేపట్టనున్నట్లు తెలుస్తోంది. మార్చి 15లోగా దీనిపై పార్టీ నూతన అధినేత పేరును ప్రకటించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. దీంతో నడ్డా వారసుడెవరు అనేది ఆసక్తికరంగా మారింది. భాజపా రాజ్యాంగం ప్రకారం.. జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకునే పక్రియను ప్రారంభించే ముందు కనీసం సగం రాష్ట్ర యూనిట్లలో సంస్థాగత ఎన్నికలు పూర్తి చేయాలి. ఇప్పటివరకు 12 రాష్ట్రాల్లో ఆ పక్రియ పూర్తయ్యింది. జాతీయ అధ్యక్షుడి ఎన్నిక కోసం కనీసం మరో ఆరు రాష్ట్రాల్లో యూనిట్ చీఫ్‌లను ఎన్నుకోవాల్సి ఉంటుంది. దీంతో భాజపా తమ కార్యాచరణను ముమ్మరం చేసింది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తమిళనాడు, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, అస్సాం, గుజరాత్ రాష్ట్రాల్లో పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రణాళికలు చేపట్టింది. మరోవైపు.. జాతీయఅధ్యక్షుడి పదవికి ప్రతిపాదిత పేర్లను సూచించాలని రాష్ట్ర ఇన్‌ఛార్జ్‌లను అధిష్ఠానం కోరింది. 2019లో భాజపా అధికారంలోకి వచ్చిన తర్వాత 2020లో జేపీ నడ్డా జాతీయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతేడాది లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ఆయన పదవీకాలాన్ని పొడిగించారు. నడ్డా నాయకత్వంలో వివిధ రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ భాజపా సత్తా చాటింది. దీంతో మూడోసారి అధికారంలోకి వచ్చిన కాషాయ పార్టీ.. నడ్డాను కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకొని ఆరోగ్యశాఖ బాధ్యతలు అప్పగించింది. ఈక్రమంలోనే పార్టీ అధ్యక్ష బాధ్యతలను మరో నాయకుడికి అప్పగించేందుకు సిద్ధమైంది. అయితే, ఈ పదవికి ఎవరిని తీసుకోనున్నారనేది ఇప్పుడు ఉత్కంఠగా మారింది. రేసులో పలువురి పేర్లు తెర పైకి వస్తున్నాయి. మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, రాజస్థాన్ మాజీ సీఎం వసుంధర రాజే, పార్టీ జనరల్ సెక్రటరీ సునీల్ బన్సల్, మహారాష్ట్ర భాజపా అగ్రనేత వినోద్ తావడే పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అయితే బిజెపిలో పేర్లు ప్రచారంలో ఉన్నా...అప్పటికప్పుడు మళ్లీ కొత్త పేర్లు వస్తుంటాయి. అయితే శివరాజ్ సింగ్ చౌహాన్ పేరు ప్రముఖంగా వినపడుతోంది.

# ఈషా ఫౌండేషన్‌కు సుప్రీంలో ఊరట



న్యూఢిల్లీ,ఈశా ఫౌండేషన్‌కు సుప్రీంలో ఊరట దక్కింది. కోయంబత్తూరు వెల్లియన్‌గిరి కొండలో నిర్మించిన ఈశా ఫౌండేషన యోగా, ధ్యాన కేంద్రంపై నిర్బంధ చర్య ఏదీ ఉండరాదని సుప్రీం కోర్టు న్యాయమూర్తులు సూర్య కాంత్; ఎన్ కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం ఆదేశించింది. కాలుష్య నియంత్రణ బోర్డు జారీ చేసిన పర్యావరణ నిబంధనలు, ఆదేశాలు అన్నిటినీ యోగ, ధ్యాన కేంద్రం పాటిస్తుందని బెంచ్ తెలియజేసింది.వెల్లియన్‌గిరి కొండ దిగువన సరైన పర్యావరణ అనుమతి లేకుండా భవనాల నిర్మాణంపై జగ్గీ వాసుదేవ్ సారథ్యంలోని ఈశా ఫౌండేషన్‌కు తమిళనాడు కాలుష్య నివారణ బోర్డు (టిఎన్‌పిసిబి) జారీ చేసింది. ఈ నోటీసులను రద్దు చేసిన మద్రాసు హైకోర్టు ఉత్తర్వులపై జోక్యానికి సుప్రీం కోర్టు నిరాకరించింది. యోగ, ధ్యాన కేంద్రాన్ని విస్తరించే పక్షంలో సముచిత ప్రాధికార సంస్థ ముందస్తు అనుమతి తీసుకోనున్నట్లు బెంచ్ తెలిపింది. అయితే, ఈ ఉత్తర్వు అక్రమ నిర్మాణం క్రమబద్ధీకరణకు ఆనవాయితీని సృష్టించబోదని, కేసు విలక్షణ వాస్తవాలు, పరిస్థితుల దృష్ట్యా ఈ ఉత్తర్వు జారీ చేయడమైందని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. కోయంబత్తూరులో ఈశా ఫౌండేషన్ ఏర్పాటు చేసినవి విద్య కేటగరీ కిందకు వస్తాయని పేర్కొంటూ హైకోర్టు 2022 డిసెంబర్ 14న టిఎన్‌పిసిబి నోటీసును కొట్టివేసింది. 2021 నవంబర్ 19న బోర్డు జారీ చేసిన నోటీసును హైకోర్టు కొట్టివేసి, ఈశా ఫౌండేషన్ పిటిషన్‌ను అనుమతించింది. ముందస్తు పర్యావరణ అనుమతి లేకుండా వెల్లియన్‌గిరి కొండ దిగువన భవనాల నిర్మాణంపై బోర్టు సంజాయిషీ నోటీస్ జారీ చేసింది.

### హరీశ్‌రావుపై మరో కేసు నమోదు

హైదరాబాద్,బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావుపై మరో కేసు నమోదు అయింది. బాచుపల్లి పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. హరీష్‌రావు, ఆయన అనుచరులు బెదిరిస్తున్నారని కాంగ్రెస్ నేత చక్రధర్ గౌడ్ బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఏ –1 గా వంశీ కృష్ణ, ఏ –2 గా హరీష్‌రావు, ఏ–3 సంతోష్‌కుమార్, ఏ–4గా పరుశు రాములు పేర్లు చేర్చారు.

# షేక్ హసీనాను గద్దె దించిన విద్యార్థి నేత కొత్త రాజకీయ పార్టీ..

ఢాకా,వివాదాస్పద బంగ్లాదేశ్ విద్యార్థి నేత, గతేడాది ఆగస్టులో విద్యార్థి ఉద్యమం ఎగిసిపడేందుకు కారణమైన విద్యార్థి నేత నహిద్ ఇస్లాం కొత్త రాజకీయ పార్టీని శుక్రవారం ప్రారంభించాడు.ఇతనే షేక్ హసీనా తన పదవికి రాజీనామా చేయడంలో, హసీనా వ్యతిరేక ఉద్యమాన్ని నిర్మించడంలో కీలక పాత్ర పోషించాడు. ఢాకాలో కొత్తగా రాజకీయ పార్టీని ఏర్పాటు చేశారు. గత సంవత్సరం బంగ్లాదేశ్‌ను ఎగిసిపడిన స్టూడెంట్ అగైనెస్ట్ డిస్క్రిమినేషన్‌ఉద్యమానికి నాయకత్వం వహించిన నహిద్, కొత్త పార్టీకి 'జాతియా నాగోరిక్ పార్టీ' లేదా నేషనల్ సిటిజన్ పార్టీగా పేరు పెట్టారు.షేక్ హసీనా తన పదవి నుంచి దిగిపోయిన తర్వాత, మహ్మద్ యూనస్ నేతృత్వంలో ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వంలో నహిద్ ఇస్లాం టెలికమ్యూనికేషన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మరియు పోస్ట్స్ మంత్రిత్వ శాఖ సలహాదారుగా పనిచేశారు. అయితే, కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు కోసం ఆయన తన పదవికి రాజీనామా చేశారు. "బంగ్లాదేశ్, బంగ్లాదేశ్ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని దేశాన్ని నిర్మిస్తాము" అని తన పార్టీ ప్రారంభ కార్యక్రమంలో చెప్పాడు.విద్యార్థి నేతగా ఉన్న నహిద్ ఇస్లాం, దేశంలో తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటులో కీలకంగా వ్యవహరించాడు. షేక్ హసీనా ఢాకా నుంచి ఢిల్లీ వచ్చిన తర్వాత, ఇతను బంగ్లాదేశ్ అధ్యక్షుడు మహ్మద్ షాబుద్దీన్, ఆర్మీ చీఫ్ జనరల్ వాకర్–ఉజ్–జమాన్‌లతో అనేక రౌండ్ల చర్చలు జరిపారు. మహ్మద్ యూనస్‌ని తాత్కాలిక ప్రభుత్వాధినేతగా ఉండేందుకు ఒప్పించడంలో కీలక పాత్ర పోషించాడు.ఇదిలా ఉంటే, ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో షేక్ హసీనా పార్టీకి ప్రత్యామ్నాయంగా తన పార్టీని మార్చేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఆయన



రాజీనామా, పార్టీ ఏర్పాటు వెనక మహ్మద్ యూనస్ ఉన్నారనే వాదన కూడా ఉంది. గతేడాది, బంగ్లాదేశ్ హింసలో హిందువులపై దాడులను నహిద్ ఇస్లాం ఏ మాత్రం ఖండించలేదు.

### 6న తెలంగాణ కేబినేట్ భేటీ...

హైదరాబాద్,రాష్ట్ర మంత్రివర్గ సమావేశం మార్చి 6వ తేదీన నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశం జరుగనుంది. ఈ కేబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు. రాష్ట్రంలో రెండో దఫా కులగణన నిర్వహించిన నేపథ్యంలో వాటికి సంబంధించిన గణాంకాలపై కేబినెట్ చర్చించనుంది. అలాగే బిసిలకు రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com